

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 19-03-2026 | సంపుటి - 27 | సంచిక -297 | రూ : 4 | పేజీలు: 8







## హిల్ట్ పాలసీ, టీడీఆర్‌లపై

# విచారణకు సిద్ధం

- కేటీఆర్, హరీశ్ లేఖరాసిన వెంటనే ఆదేశిస్తా
- మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు అడ్డుపడుతున్నారు
- అసెంబ్లీకి రాకుండా కేసీఆర్ రూ.1.06 కోట్ల వేతనం తీసుకున్నారు
- బుల్లెట్ ట్రైన్ హబ్‌కు 500-600 ఎకరాలు కేటాయిస్తా
- స్వశక్తితో ఎదిగాను.. నేను కష్టజీవిని..
- 'గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం'లో సీఎం రేవంత్‌రెడ్డి



2లో



## ఫామ్‌హౌస్ కేసు..

# కొకైన్ కొన్నది హైదరాబాద్‌లోనే?

- శిమ్లా నుంచి తెచ్చినట్లు చెప్పడం కట్టుకథే
- రెండోరోజు నలుగురిని విచారించిన సిట్
- డ్రగ్స్ ముఠాలతో మాజీ ఎమ్మెల్యేకి సంబంధాలపై పోలీసుల ఆరా

2లో

# రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు

- మీకోసం భవిష్యత్తు ఎదురుచూస్తుంటుంది
- పార్లమెంటు ఓ సార్వత్రిక విశ్వవిద్యాలయం
- రాజ్యసభలో ప్రధాని మోదీ
- పదవీ విరమణ చేయనున్నవారికి వీడ్కోలు



2లో


## బెంగాల్ బరిలో

# చావోరేవో

- హిందుత్వ ఎజెండాతో భాజపా జోరు
- ప్రతి వ్యూహాలతో తృణమూల్ దూకుడు
- నీరేంద్ర దేవ్

2లో

# యుద్ధ బీభత్సం



2లో

- అమెరికా, ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి మృతి
- ఇరాన్ క్షిపణి స్థావరాలపై అమెరికా బంకర్ విధ్వంసక బాంబులు
- బుషెర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో వైమానిక దాడి
- లారిజానీ హత్యకు ప్రతీకారంగా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడిన టెహ్రాన్
- ఇరాన్ ప్రభుత్వం బలహీనపడలేదు : అమెరికాకు ఇజ్రాయిల్ రహస్య నివేదిక




## నేడు గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్

# ప్రదానోత్సవం..

హైదరాబాద్ : హైదరాబాద్‌లో నేడు తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ (TGFA) ప్రదానోత్సవం జరగనుంది. HITEX కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ వేడుకలో సీఎం రేవంత్, భారతీయ సినీ రంగ దిగ్గజాలు, రాష్ట్ర నాయకులు హాజరుకానున్నారు. ఈ వేడుకలో మెగాస్టార్ చిరంజీవి, కమల్ హాసన్, నాగార్జున, రష్మిక మందన్న, మాధురి దీక్షిత్ వంటి ప్రముఖులు పాల్గొంటారు. నిధి అగర్వాల్, శ్రేయా ఘోషల్, దేవి శ్రీ ప్రసాద్, మంగ్లీ వంటి కళాకారులు ప్రదర్శనలు ఇవ్వనున్నారు.




# రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు

ఢిల్లీ: ఫుల్‌స్టాప్ అనేది రాజకీయాల్లో ఉండదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఈ ఏడాది ఏప్రిల్‌జులై మధ్య పదవీవిరమణ చేయబోతును 59 మంది రాజ్యసభ సభ్యులకు బుధవారం ఎగువసభలో వీడ్కోలిచ్చారు. వీరు అందించిన సేవల్ని ప్రధాని కొనియాడారు.. పార్లమెంటు అనేది సార్వత్రిక విశ్వవిద్యాలయమని చెప్పారు. పదవీ విరమణ చేస్తున్నవారు దేశానికి సంబంధించిన అంశాల్లో క్రియాశీలంగా ఉండాలని కోరారు. ''..ఇలాంటి వీడ్కోలు కార్యక్రమాలు మనలో విభేదాలు సమసిపోయేలా చేస్తాయి. ఇలాంటి సందర్భాల్లో మనం భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి ఉమ్మడి భావాలను పంచుకుంటాం. రిటైరవుతున్నవారి జీవితం ఇక్కడితో ముగిసిపోయినట్లు కాదు. వారికీ భవిష్యత్తు ఉంటుంది. వారి అనుభవం, సేవలు దేశానికి ఎప్పటికీ గుర్తుంటాయి. రిటైరవుతున్న మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడ, విపక్షనేత మల్లికార్జున ఖర్గే, ఎన్సీపీ అధిపతి శరద్‌పవార్‌లు దిగ్గజాలు. వీరు తమ జీవితాల్లో సగభాగాన్ని పార్లమెంటరీ కార్యకలాపాలకే వెచ్చించారు.. ఎంతో అంకితభావంతో సభకు హాజరవుతూ వస్తున్నారు. కొత్త సభ్యులకు ఇది స్ఫూర్తినిస్తుంది. ఇంతకాలం పాటు కొనసాగడం చిన్న అంశం కాదు. డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ ఎంతో మృదువుగా మాట్లాడే వ్యక్తి అయినా కఠిన నిర్ణయాలు తీసుకుంటారు. దేశం నలుమూలలా ఆయన పర్యటిస్తూ, యువతరంతో ముచ్చటిస్తూ, వారిలో చైతన్యం రగిలించేందుకు పాటుపడ్డారు. కేంద్ర మంత్రి రాందాస్ అఠావలే ఎవర్‌గ్రీన్ నేత. నిరంతరం మీడియా కళ్లు మనపై ఉండటం మూలాన సభలో ఛలోక్తులు, హాస్యభరిత ఘటనలు తగ్గాయి'' అని మోదీ చెప్పారు.

**రెండు సభల విధానంతో మేలు**

పార్లమెంటులో రెండుసభలు ఉండటం వల్ల ఒక అంశంపై రెండో అభిప్రాయం తెలుసుకునేందుకు వీలవుతూ ప్రజాస్వామ్యంలో నిర్ణయక ప్రక్రియను బలోపేతం చేస్తోందని మోదీ అన్నారు. కుటుంబంలోనైనా కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినప్పుడు సభ్యులంతా కూర్చొని ఏకాభిప్రాయాన్ని సాధిస్తారని చెప్పారు. ఆరేళ్ల పదవీకాలంలో పలువురు సభ్యులు పార్లమెంటు పాత, కొత్త భవనాల్లో సేవలు అందించారని గుర్తుచేశారు. పార్లమెంటులో అనుభవం ఎంతో విస్తారమైనదని పేర్కొన్నారు. 20 రాష్ట్రాలకు చెందిన 59 మంది సభ్యుల పదవీకాలం రాబోయే నాలుగు నెలల్లో ముగుస్తోందని, వారిలో 9 మంది మహిళలని రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ చెప్పారు. పదవీ విరమణను కొత్త బాధ్యతలకు నాందిగా చూడాలన్నారు. ఖర్గే మాట్లాడుతూ దేవెగౌడతో తనకు 54 ఏళ్లకు పైగా ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ''రాజకీయాల్లో, ప్రజా జీవితంలో ఉన్నవారు దేశానికి సేవ చేయాలనే తపనతో అలసిపోరు, విరమించుకోరు. నేను దేవెగౌడతో చాలాకాలం పనిచేశాను. ఆ తర్వాత ఏమైందో తెలియదు. ఆయన మమ్మల్ని ప్రేమించి, మోదీని పెళ్లి చేసుకున్నారు'' అని

# ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు

హైదరాబాద్ : ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం శాసనమండలిలో అద్దంకి దయాకర్, మదుసూధనాచారి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, భానుప్రసాద్‌రావు, ఎల్ రమణ, నెల్లికంటి సత్యం, తక్కళ్లపల్లి రవిందర్‌రావు, తదితర సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. ఇప్పటికే మొదటి విడతలో మూడు లక్షలకుపైగా ఇండ్లను మంజూరు చేశామనీ, మిగిలిన మూడు విడతలను కూడా దశలవారీగా పూర్తిచేస్తామని చెప్పారు. రాబోయే మూడేండ్లలో పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామన్నారు. గతంలో ప్రారంభమై వివిధ స్థాయిలో ఆగిపోయిన ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందని అన్నారు. కులం, మతం, పార్టీతో సంబంధం లేకుండా అత్యంత పేదలనే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నామని చెప్పారు. ఎంపికలో పొరపాట్లు జరిగితే చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి నాటికి లక్ష ఇండ్లు పూర్తి కానున్నాయని అన్నారు. డబుల్ బెడ్ రూం పథకం పెండింగ్ బిల్లులను 99 శాతం చెల్లించామన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాలపై త్వరలో నిర్ణయం

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటుందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ విషయంలో సీఎం స్పష్టత ఇచ్చారనీ, న్యాయస్థానం పరిధిలో ఇబ్బందుల్లేకుండా ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. రాబోయే రెండు, మూడు నెలల్లో డిజిటల్ మీడియా పాలసీని తీసుకు రాబోతున్నామని ప్రకటించారు. జర్నలిస్టులకు భద్రత కల్పించే విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విషయంలో కొంత మంది లేనిపోని అపోహలను సష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఎలాంటి బేషజాలాలకు పోకుండా మొదట విడుదల చేసిన జీవోపై జర్నలిస్టుల సంఘాల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని మార్పులు చేర్పులు చేసామని గుర్తు చేశారు.

# బెంగాల్ బరిలో చావోరేవో

ఎన్నికల షెడ్యూలు ప్రకటనతో పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు మరింత వేడెక్కాయి. అధికార తృణమూల్ కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం భాజపా మధ్యే ఈసారీ పోరు కేంద్రీకృతమై ఉందన్నది సుస్పష్టం. చావోరేవో అన్నట్టుగా తలపడేందుకు అవి సిద్ధమవుతున్నాయి. కమలదళం మరోసారి ప్రధానంగా హిందుత్వ ఎజెండాతో బరిలో దిగుతోంది. ముస్లిం అనుకూల వైఖరిని ప్రదర్శిస్తుందంటూ సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్‌కు ముందునుంచీ పేరుంది. అయితే దిఘాలో కొత్తగా నిర్మించిన జగన్నాథ్ ఆలయం గురించి తృణమూల్ నేతలు ప్రచారంలో తరచూ ప్రస్తావిస్తుండటం ఆసక్తి రేపుతోంది. ఈ అసెంబ్లీ ఎన్నికలు బెంగాల్‌ను మరో ఐదేళ్లపాటు పాలించబోయేది ఎవరో తేల్చడానికి మాత్రమే కాకుండా, ఆ రాష్ట్రం విషయంలో ఎవరి సిద్ధాంతానికి ప్రజామోదం ఉందో నిర్ధారించబోతున్నాయి.

**భాజపా: జాతీయవాద ప్రచారం**

2019లో బెంగాల్‌లో 18 లోక్‌సభ సీట్లు గెల్చుకొని భాజపా అందరినీ ఆశ్చర్యపరిచింది. నాడు ఉత్తర బెంగాల్‌లోని 8 పార్లమెంటు స్థానాల్లో ఏడు కమలనాథుల ఖాతాలోనే చేరాయి. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తర బెంగాల్‌లోని 54 సీట్లలో 30 చోట్ల కాషాయ పార్టీ విజయభేరి మోగించింది. రాష్ట్రంలో భాజపా మనుగడకు ఆ ప్రాంతం వెన్నెముకగా నిలుస్తోంది. 'మదర్సాల గురించి మాత్రమే తృణమూల్ ఆలోచిస్తుంది. మన పిల్లల భవిష్యత్తు గురించి దానికి పట్టింపు లేదు. ఆ పార్టీ పాలనలో బెంగాల్ అభివృద్ధి చెందదు' అని కేంద్ర హోంమంత్రి, భాజపా ప్రధాన వ్యూహకర్త అమిత్ షా పదేపదే చెబుతున్నారు. హిందువులను పూర్తిగా తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. భాష, సాహిత్యం వంటి అంశాల్లో జాతీయవాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కాషాయ పార్టీ ప్రయత్నిస్తోంది. బెంగాలీ బహుళత్వానికి చొరబాటుదారుల వల్ల తీవ్ర నష్టం కలుగుతోందని చెబుతోంది. ఓబీసీ కోటా ప్రయోజనాల్లో ముస్లింలకు అనుచిత లబ్ధి చేకూరుతోందని ఆరోపిస్తోంది. స్థానిక అగ్రవర్ణ వర్గమైన భద్రలోక్‌తో పాటు అణగారిన వర్గాలైన రాజ్‌బోంగ్షీలు, మతువాలు, నామశూద్రులు, ఆదివాసీ తెగలు, గూర్ఖాల మద్దతును పొందడంపై కమలదళం చాన్నాళ్లుగా దృష్టిపెట్టింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించడం, అవినీతి పెరగడంపై ఆ పార్టీ నేతలు జోరుగా ప్రచారం చేస్తున్నారు.

*** తృణమూల్: బెంగాల్ మళ్లీ గెలుస్తుందంటూ..**

భాజపా హిందుత్వ ఎజెండా తృణమూల్‌కు అనుకూలంగా మారే అవకాశాలు లేకపోలేదు. ''దేశంలో పౌరసత్వ సవరణ చట్టాన్ని తొలిసారిగా బెంగాల్‌లోనే కేంద్ర అమలు చేయించింది. ఆ చట్టం ముస్లింలపై వివక్ష చూపేలా ఉంది. దానికి వ్యతిరేకంగా ముస్లింలు ఏకమైతే.. తృణమూల్ గెలుపు తేలికవుతుంది'' అని కూచ్‌బిహార్‌కు చెందిన ప్రబీర్ మజుందార్ చెప్పుకొచ్చారు. బెంగాలీ హిందువుల్లో చాలామంది (ముఖ్యంగా మధ్యతరగతివారు) ఆ పార్టీ ప్రచార తీరుపై పెదవి విరుస్తున్నారు కూడా. ''ప్రతి విషయంలోనూ హిందూముస్లిం అనే విభజనను మేం చూడబోం'' అంటూ కోల్‌కతాకు పాతిక కిలోమీటర్ల దూరంలోని ఖర్దా ప్రాంతానికి చెందిన గృహిణి తృప్తి సేన్ చేసిన వ్యాఖ్య అందుకు నిదర్శనం. దక్షిణ బెంగాల్‌తో పాటు రాష్ట్ర రాజధాని నగరమైన కోల్‌కతాలో తృణమూల్‌కు గట్టి పట్టుంది. ముఖ్యంగా కోల్‌కతావ్యాప్తంగా ప్రచారంలో అధికార పార్టీ దూసుకెళ్తోంది. ''ఎంత దాడి చేసినా తలొగ్గబోం.. బెంగాల్ మళ్లీ గెలుస్తుంది'' అన్న నినాదాన్ని తృణమూల్ నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. మరోవైపు భాజపా పోస్టర్లు/పతాకాలు వీధుల్లో చాలా తక్కువగా దర్శనమిస్తున్నాయి. ఇక కమలనాథుల జాతీయవాద ప్రచారాన్ని తిప్పికొట్టడంలో మమత దూకుడు ప్రదర్శిస్తున్నారు. బెంగాల్ చరిత్ర, ఆచార వ్యవహారాలు, ఇక్కడి సాంస్కృతిక దిగ్గజాల గురించి వారికి బొత్తిగా అవగాహన లేదని ఎద్దేవా చేస్తున్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ శాంతినికేతన్‌లో జన్మించారంటూ భాజపా మాజీ అధ్యక్షుడు జె.పి.నడ్డా పొరపాటుగా మాట్లాడటాన్ని పదేపదే గుర్తుచేస్తున్నారు. సమగ్ర శిక్షా అభియాన్, ప్రధానమంత్రి అవాస్ యోజనల ఫలాలు రాష్ట్రానికి అందకుండా భాజపా నేతృత్వంలోని కేంద్రం అడ్డుకుందని తృణమూల్ నేతలు ప్రచారంలో పేర్కొంటున్నారు.

**ఈసీ ప్రకంపనలు**

పోలీసులు, అధికార యంత్రాంగం, ఎన్నికల కమిషన్ (ఈసీ) పాత్ర కూడా ఎన్నికల వేళ చాలా కీలకం. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అంశం బెంగాల్ రాజకీయాలను ఇప్పటికే కుదిపేసింది. ఎన్నికల షెడ్యూలును ప్రకటించిన 24 గంటల్లోపే.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, కోల్‌కతా పోలీసు కమిషనర్‌లను ఈసీ మార్చేయడం ప్రకంపనలు సృష్టిస్తోంది.

# యుద్ధ బీభత్సం

ఇరాన్‌పై అమెరికా..ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభమై..బుధవారానికి 19వ రోజుకు చేరింది. ఇరాన్‌ను దెబ్బ తీయటానికి సర్వశక్తులు ఒడ్డుతున్నా.. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో ఖమేనీ బృందం శత్రుదేశాలను అణగదొక్కేందుకు ఎదురుదాడికి దిగుతోంది. యుద్ధంలో కీలకపాత్ర పోషిస్తున్న ముఖ్యనేతల్ని మట్టుబెడుతున్నా.. ఆత్మ విశ్వాసమే తమ ఆయుధంలా ఇరాన్ ప్రతీకార దాడులకు దిగుతోంది. ఇది ట్రంప్, నెతన్యాహులకు మింగుడు పడటం లేదు. రంజాన్ పండుగ తర్వాత ఇరాన్ మరింతగా ప్రతీకార దాడులకు దిగే అవకాశాలున్నాయని నిఘావర్గాలు హెచ్చరికలు చేస్తున్నాయి.

**నవ తెలంగాణ – సెంట్రల్ డెస్క్**

మధ్యప్రాచ్యంలో యుద్ధ బీభత్సం కొనసాగుతోంది. ఇరాన్ భద్రతా దళాల అధినేత అలీ లారిజానీ, బసిజ్ వాలంటరీ మిలిషియా ఫోర్స్ కమాండర్ జనరల్ సొలైమనీలను హతమార్చిన ఇజ్రాయిల్, అమెరికా సేనలు బుధవారం జరిపిన తాజా దాడులలో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్‌ను చంపాయి. త్వరలోనే మరిన్ని 'అనూహ్య పరిణామాలు' చోటుచేసుకుంటాయని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కట్జ్ హెచ్చరించారు. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా ఇరాన్ నేతలను, సైనికాధికారులను మట్టుపెట్టే అధికారాన్ని రక్షణ దళాలకు కట్టబెట్టామని ఆయన తెలిపారు. గుడారంలో దాక్కున్న సొలైమనీని వైమానిక దాడిలో హతమార్చామని ఇజ్రాయిల్ సైనిక ఇంటెలిజెన్స్ అధికారి ఒకరు చెప్పారు. మరోవైపు హార్ముజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ క్షిపణి స్థావరాలపై అమెరికా 2,200 కిలోల బంకర్ విధ్వంసక బాంబులను ప్రయోగించింది. జలసంధిలో ఉన్న నౌకలను ధ్వంసం చేసేందుకు ఇరాన్ క్రూయిజ్ క్షిపణులను మోహరించిందని, వాటిని లక్ష్యంగా చేసుకొని ఈ దాడులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది. హార్ముజ్ జలసంధిలో ప్రయాణించే చమురు ట్యాంకర్లకు రక్షణగా నౌకలను పంపాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన అభ్యర్థనను అనేక మిత్ర దేశాలు తోసిపుచ్చిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ దాడి జరగడం గమనార్హం. ఇరాన్ దక్షిణ తీరంలోని బుషెర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో కూడా దాడి జరిగింది. అయితే ఈ ఘటనలో ఎలాంటి రేడియేషన్ వెలువడలేదని, అలాగే నష్టం కూడా జరగలేదని రష్యా, ఇరాన్ అధికారులను ఉటంకిస్తూ అసోసియేటెడ్ ప్రెస్ తెలియజేసింది. అణు విద్యుత్ ప్లాంటులో ఉన్న మెట్రోలజీ సర్వీస్ భవనం సమీపంలో ఈ దాడి జరిగింది. ఈ దాడిపై తమకు ఇరాన్ సమాచారం ఇచ్చిందని ఐరాసకు చెందిన అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) చెప్పింది. పర్షియన్ గల్ఫ్ వెంబడి టెహ్రాన్‌కు దక్షిణంగా 750 కిలోమీటర్ల దూరంలో ఈ అణు శక్తి కేంద్రం ఉంది. ఇది ఇరాన్ నడుపుతున్న ఏకైక అణు శక్తి ప్లాంట్. రష్యా సాంకేతిక నిపుణుల సాయంతో దీనిని నిర్వహిస్తున్నారు. కాగా ఇరాన్‌లోని దొరుద్ నగరంపై జరిగిన తాజా దాడిలో ఏడుగురు చనిపోగా 56 మంది గాయపడ్డారు.

**చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో...**

యుద్ధంలో నేతలు, సైనికాధికారులను కోల్పోతున్నప్పటికీ ఇరాన్ చెక్కుచెదరని ఆత్మ విశ్వాసంతో పోరు సాగిస్తోంది. లారిజానీ హత్యకు ప్రతీకారంగా అనేక గల్ఫ్ దేశాలపై వివిధ రకాల వార్‌హెడ్లతో కూడిన క్షిపణులను, డ్రోన్లను ప్రయోగిస్తోంది. వాటిని అడ్డుకునేందుకు గల్ఫ్ దేశాలు ఆపసోపాలు పడుతున్నాయి. ఇజ్రాయిల్ గగనతల రక్షణ వ్యవస్థల కన్నుగప్పి భారీ నష్టాన్ని కలిగించే ఓ ఆయుధాన్ని ఇరాన్ ప్రయోగించినట్టు సమాచారం. ఇరాన్ ప్రయోగించిన ఖొర్రంషెహర్4, ఖ్వాద్ క్షిపణుల కారణంగా ఖతార్, కువైట్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిలలో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. ఇరాన్ దాడులలో యూఏఈ బాగా దెబ్బతింటోందని, క్షిపణులు, డ్రోన్లు సహా ఇప్పటి వరకూ గల్ఫ్ దేశాలపై మూడు వేలకు పైగా దాడులు జరిగాయని అల్ జజీరా వార్తా సంస్థ ప్రతినిధి బస్రావీ తెలిపారు. వీటిలో సగం దాడులు యూఏఈని లక్ష్యంగా చేసుకొని జరిగినవే. దాడుల కారణంగా దుబాయిలోనే కాక గల్ఫ్ దేశాలలోని అనేక నగరాలలో దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. గల్ఫ్‌లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, ఆయా దేశాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలుస్తోంది. బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ప్రాంగణాన్ని ఓ క్షిపణి తాకింది. అయితే ఈ దాడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. సౌదీ అరేబియాలో అమెరికా దళాలు, యుద్ధ విమానాలకు ఆశ్రయం కల్పిస్తున్న ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపై బాలిస్టిక్ క్షిపణి దాడి జరిగింది. యూఏఈలోని ఆస్ట్రేలియా సైనిక స్థావరంపై కూడా దాడి జరిగింది. ఈ ఘటనలో స్వల్పంగా మంటలు చెలరేగాయి.

**కువైట్ రాకుమారుడితో మాట్లాడిన మోడీ**

మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని నరేంద్ర మోడీ కువైట్ రాకుమారుడు సబహ్ అల్‌ఖలీద్ అల్‌హమద్ అల్‌ముబారక్ అల్ సహబ్‌తో బుధవారం టెలిఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా ఆయనకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేశారు. కువైట్ సార్వభౌమత్వంపై జరుగుతున్న దాడులను ఖండించారు. హార్ముజ్ జలసంధి మీదుగా చమురు నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించేలా చూసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

*** యుద్ధోన్మాదానికి బలవుతున్న చిన్నారులు**

లెబనాన్‌లో హెజ్బొల్లాను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులలో ప్రతి రోజూ అభం శుభం తెలియని చిన్నారులు బలవుతూనే ఉన్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి ఇప్పటి వరకూ కనీసం 111 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోగా 334 మంది గాయాలపాలయ్యారు. మధ్యప్రాచ్యంలో ఇజ్రాయిల్, అమెరికాల యుద్ధోన్మాదానికి 1,200 మంచి పిల్లలు చనిపోయారు. ఈ నేపథ్యంలో యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని ఇరు పక్షాలకూ యూనిసెఫ్ సూచించింది.

**అమరులకు కన్నీటి వీడ్కోలు**

అమెరికా, ఇజ్రాయిల్ దాడులలో మరణించిన భద్రతా దళాల అధిపతి అలీ లారిజానీకి, నౌకాదళానికి చెందిన ఇతర అమరవీరులకు ఇరాన్ ఘనంగా నివాళులు అర్పించింది. వారి త్యాగాన్ని దేశం ఎన్నడూ మరవబోదని, అది రాబోయే కాలంలో సాయుధ దళాలకు మరింత శక్తిని అందిస్తుందని అంత్యక్రియలకు హాజరైన నేతలు కొనియాడారు. మృతవీరుల ఆత్మశాంతి కోసం ప్రజలు పెద్ద ఎత్తున ప్రార్థనలు జరిపారు. వారి సేవలను, అంకితభావాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీటి వీడ్కోలు పలికారు.

*** ఇరాన్ ప్రభుత్వం బలహీనపడలేదు : అమెరికాకు ఇజ్రాయిల్ రహస్య నివేదిక**

ఇరాన్ యుద్ధంపై అమెరికాకు ఇజ్రాయిల్ ఓ రహస్య నివేదికను అందజేసింది. ఇరాన్ ప్రభుత్వం బలహీనపడలేదని, తుది వరకూ పోరాడేందుకు సిద్ధంగా ఉన్నదని ఆ నివేదిక తెలిపిందని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక వెల్లడించింది. ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను అణచివేస్తున్నారని, నిరసనకారులను హతమారుస్తున్నారని ఆ నివేదిక ఆరోపించింది. ఇరాన్ నాయకత్వం ఇప్పుడప్పుడే అంతర్గతంగా కుప్పకూలే అవకాశాలు కానరావడం లేదని జెరుసలేంలోని అమెరికా రాయబార కార్యాలయానికి పంపిన నివేదికలో ఇజ్రాయిల్ అభిప్రాయపడింది. ఇరాన్ అంతర్గత భద్రతా యంత్రాంగం పటిష్టంగా ఉన్నదని తెలియజేసింది. ఆ నివేదిక ప్రకారం బసిజ్ వంటి దళాల మద్దతుతో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) బలంగా ఉంది.

**గుజరాత్ చేరిన చమురు నౌక**

భారత్‌కు చెందిన చమురు నౌక 'జగ్ లాడ్కీ' బుధవారం గుజరాత్‌లోని ముంద్రా ఓడరేవుకు చేరుకుంది. ఎల్పీజీతో హార్ముజ్ జలసంధి మీదుగా ప్రయాణించిన నౌకలు శివాలిక్, నందాదేవి ఇప్పటికే దేశానికి చేరిన విషయం తెలిసిందే. జగ్ లాడ్కీ నౌకలో 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉంది.

*** నేతలను కోల్పోతున్నా వెనక్కి తగ్గని ఇరాన్**

గత నెల28న మధ్యప్రాచ్యంలో మొదలైన యుద్ధం బుధవారం 19వ రోజుకు చేరింది. మొదటి రోజే సుప్రీం నేత అలీ ఖమేనీని, పలువురు సైనికాధికారులను ఇరాన్ కోల్పోయింది. ఇజ్రాయిల్, అమెరికా దాడులలో మంగళవారం భద్రతా దళాల అధిపతి లారిజానీ, బసిత్ దళాల కమాండర్ కమాండర్ సొలైమనీ చనిపోయారు. తాజాగా ఇంటెలిజెన్స్ మంత్రి ఖతీబ్‌నూ ఇరాన్ పోగొట్టుకుంది. అయినప్పటికీ అక్కడి నాయకత్వం ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. అలీ ఖమేనీ హతమైనా ఆయన కుమారుడు మొజ్తాబా సుప్రీం నేత అయ్యారు. ఆయన నేతృత్వంలో ప్రతీకార దాడులు ఉధృతమయ్యాయి. క్షిపణులు, డ్రోన్లతో ఇజ్రాయిల్ పై, గల్ఫ్ దేశాలలోని అమెరికా ఆస్తులపై ఇరాన్ విరుచుకుపడుతోంది. ఈ దాడులలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు కోలుకోలేని దెబ్బ తగులుతోంది. అంతర్జాతీయ చమురు మార్కెట్లకు ఆయువు పట్టయిన హార్ముజ్ జలసంధిని మూసివేయడంతో పాటు దీర్ఘకాల పోరుకు ఇరాన్ సమాయత్తమవుతోంది. కనీసం ఆరు నెలల పాటు యుద్ధాన్ని కొనసాగించేలా సన్నాహాలు చేసుకుంటోంది. ఇరాన్ సుప్రీం నేత అలీ ఖమేనీని, ఐఆర్‌జీసీ సీనియర్ కమాండర్లను అమెరికా, ఇజ్రాయిల్‌లు యుద్ధం మొదటి రోజే హతమార్చి చంకలు గుద్దుకున్నాయి. వారి మరణంతో ఇరాన్ పని అయిపోయిందని అనుకున్నాయి. కానీ 19 రోజులు గడిచినా ఇరాన్ దాడులు ఆగిపోలేదు సరికదా మరింత తీవ్రమయ్యాయి. ఇస్లామిక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి ఆందోళన చేస్తారని ఆశించినా అది కూడా జరగలేదు. అలీ ఖమేనీ మరణానంతరం సుప్రీం నేతగా ఎంపికైన ఆయన కుమారుడు మొజ్తాబాకు ఇరాన్ ప్రజానీకం పూర్తి మద్దతు తెలిపి అండగా నిలుస్తోంది. ఇరాన్ క్షిపణి వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసేందుకు అమెరికా ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ విజయం సాధించ లేకపోతోంది. ఇరాన్ యుద్ధంలో అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు కేవలం పాక్షిక విజయాలు మాత్రమే సాధించగలిగాయి. కీలక నేతలు, అధికారులు చనిపోయినా ఇరాన్ రాజకీయ వ్యవస్థ కుప్పకూలిపోలేదు. అధికార మార్పిడి త్వరితగతిన జరిగిపోయింది. ప్రారంభంలో ఎదురు దెబ్బలు తగిలినప్పటికీ సైన్యం కూడా త్వరగానే కోలుకొని సామర్థ్యాన్ని పెంచుకుంది. యుద్ధంలో ఇరాన్ సైన్యం సెజ్జిల్ బాలిస్టిక్ క్షిపణుల వంటి అత్యాధునిక వ్యవస్థలను, డ్రోన్లను ఉపయోగిస్తూ ముందుకు సాగుతోంది. ముఖ్యంగా యుద్ధంలో ఇరాన్ అణు కేంద్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. ఇక హార్ముజ్ జలసంధిని తెరిచే విషయంలో సాయపడాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మిత్ర దేశాలను వేడుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. యుద్ధంలో విజయం సాధించలేకపోయినా ఓటమి చెందే అవకాశమే లేదని ఐఆర్‌జీసీ మాజీ కమాండర్‌ఇన్‌చీఫ్ అలీ జాఫరీ తేల్చి చెప్పారు. తమ దాడులతో అమెరికా, ఇజ్రాయిల్ దేశాలను ఆర్థికంగా నష్టపరిచామని ఇరాన్ నేతలు అంటున్నారు.

# హిల్ట్ పాలసీ, టీడీఆర్‌లపై విచారణకు సిద్ధం

హైదరాబాద్: హిల్ట్ విధానంలో పరిశ్రమల తరలింపు, భూవినియోగ మార్పిడి, టీడీఆర్ బదిలీలపై 2014 జూన్ 2 నుంచి ఇప్పటివరకు జరిగిన కార్యకలాపాలపై ఏ విచారణకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. కేటీఆర్, హరీశ్‌రావులు దీనిపై లేఖరాస్తే వెంటనే ఆదేశిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. సీబీఐ, ఈడీ, ఆదాయపన్ను, సిట్ లేదా అంతర్జాతీయ సంస్థతో వారు కోరినట్టుగా విచారణ చేయించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. 'ఆనాడు అక్రమ కట్టడాలను కూల్చడానికి నోటీసు కూడా అక్కర్లేదని కేసీఆర్ అన్నారు. మూసీలో 10 వేల అక్రమ కట్టడాలు గుర్తించామని, వాటిని కూల్చేస్తామని కేటీఆర్ కూడా ప్రకటించారు' అని సీఎం గుర్తుచేశారు. ఇప్పుడు మూసీ పునరుజ్జీవంతో హైదరాబాద్ రూపురేఖలు మార్చే ప్రయత్నం చేస్తుంటే అడ్డుకుంటూ బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని సీఎం ధ్వజమెత్తారు. రీజినల్ రింగురోడ్డు దక్షిణ భాగానికి ఏప్రిల్ తర్వాత అనుమతి రానుందని, మెట్రోరైలు విస్తరణ సహా అనేక అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని.. బుల్లెట్ రైలు హబ్ కోసం శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో 500600 ఎకరాలు కేటాయించనున్నట్లు తెలిపారు.

# ఘనంగా మల్లు స్వరాజ్యం కు నివాళులు



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీర వనిత మల్లు స్వరాజ్యం జీవితం అందరికీ ఆదర్శనీయమని, ఆమె అందించిన పోరాట స్ఫూర్తిని, మానవత విలువలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎం వి ఎన్ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ అక్కెనపల్లి మీనయ్య అభిప్రాయపడ్డారు. మల్లు స్వరాజ్యం 4వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆమె మనవడు, ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ మల్లు అరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో సత్యవతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో సూర్యాపేట జిల్లాకు చెందిన ఒక నిరుపేద కుటుంబానికి జుట్టుకొండ వీరయ్య కి ఉచిత మోకాలు చిప్ప మార్పిడి ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం జీవితమంతా త్యాగాలమాయం అంటూ జీవితాంతం నిరుపేదల కోసం అభ్యున్నతి కోసం పరితపించారని గుర్తు చేశారు. ఆమె చరిత్రను మర్చిపోకుండా భవిష్యత్ తరాలకు అందించేందుకు ఆమె పేరుతో నిర్వహించే సేవా కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. ప్రతీ యేటా వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఉచిత మోకాలు మార్పిడి ఆపరేషన్ ను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. మల్లు స్వరాజ్యం మనవడు, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు మల్లు అరుణ్ రెడ్డి మాట్లాడుతూ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం తన జీవితాన్ని అట్టడుగు వర్గాల కోసం ధరపోసిన గొప్ప వనిత అన్నారు. మహిళా హక్కులు, ప్రజల హక్కులు, పేదల భూముల కోసం చివరి వరకు జీవించారని గుర్తు చేశారు. స్వరాజ్యం మూడు సంవత్సరాల కిందట చనిపోయారని, ఆమె పేరుతో ప్రతీ యేటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గొప్ప వ్యక్తుల స్ఫూర్తిని ముందుకు తీసుకు పోయందుకు ఇలాంటి కార్యక్రమం దోహద పడతాయని భావిస్తున్నట్లు చెప్పారు. అందుకే ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్ లోనూ మరింత ముందుకు తీసుకుపోతామని, ఇందుకు సంపూర్ణ సహకారం అందిస్తున్న సత్యవతి హాస్పిటల్ కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యావతి హాస్పిటల్ ఎండి డాక్టర్ . ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కార్యదర్శి పీ నర్సిరెడ్డి. ఎంజియు తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిత, చర్లపల్లి రెసిడెన్షియల్ కాలేజీ ఎకనామిక్స్ లెక్చరర్ షేక్ సుల్తానా గార్లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, డాక్టర్ సంపద, సత్యవతి వైద్యశాల ఎండి సత్యనారాయణ, కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్యాకల్టీ శంకర్ తదితరులు పాల్గొన్నారు..

## ముస్లింలకు రంజాన్ తోఫాల పంపిణీ..

ప్రజాస్ఫూర్తి ప్రతినిధి, షాద్ నగర్ : రంజాన్ తోఫా అనేది కేవలం ముస్లింలకు ఇచ్చే కానుక మాత్రమే కాదని అన్ని మతాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ముస్లిం సోదరులకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రభుత్వం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తుందని వెల్లడించారు. ప్రస్తుతం నియోజకవర్గానికి 1000, పురపాలికకు 250 తోఫాలు వచ్చాయని, పండుగలోపు ప్రతి ఒక్కరికి వీటిని అందిస్తామని వెల్లడించారు, ముస్లింల ప్రశాంతమైన వాతావరణంలో ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని సూచించారు. పవిత్రమైన రంజాన్ మాసంలో నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేసి ప్రస్తుతం వేడుకలు నిర్వహించుకోబోతున్న ముస్లింలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ వేడుకల నిమిత్తం ఫరూక్ నగర్ మండల కేంద్రంలోని ఈద్గా వద్ద అన్ని వసతులు కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. మున్సిపాలిటీ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, వావిలాల సుజీవన్, జమ్రుద్ ఖాన్, ఎండి ఇబ్రహీం, ముబారక్ అలీ ఖాన్, కౌన్సిలర్ దిలీప్ కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఘనంగా 9 వ నెల

## అన్నప్రసాద వితరణ



ప్రజాస్ఫూర్తి ప్రతినిధి షాద్ నగర్ :షాద్ నగర్ కుమ్మరి సంఘం అధ్యక్షులు నడికూడ శ్రీశైలం తండ్రి, ఎల్లయ్య జ్ఞానేశ్వర్ జ్ఞాపకార్థం ప్రతి అమావాస్య రోజున మొల్లమాంబ విగ్రహం ముందు ఎంపీడీఓ ఆఫీస్, షాద్ నగర్, హైదరాబాద్ రోడ్ లో అన్నదానం నిర్వహించారు . ఇందులో ఎంతో మంది ఆకలి తో బాధ పడే నిరుపేదలు పాల్గొని వాళ్ళ వాల ఆకలి తీర్చుకోవడం జరుగుతుంది . ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నటువంటి కుమ్మరి సంఘం అధ్యక్షుల వారికి అన్నదాన కార్యక్రమానికి తోడ్పడుతున్న సంఘం నాయకులకు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేసిన ప్రజలకు షాద్ నగర్ నియోజకవర్గం కుమ్మరి సంఘం తరుపున ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజలకు ఇబ్బందులు కలగకుండ బాక్స్ డ్రైన్ పనులు చేపట్టాలి



ప్రజాస్ఫూర్తి, కాప్రా: కుషాయిగూడ డిమార్ట్ ఎదురుగా ఉన్న సాయి మిత్ర టవర్స్ లో నివసిస్తున్న సుమారు 200 కుటుంబాలకు ఇబ్బందులు కలగకుండా బాక్స్ డ్రైన్ పనులను నిర్వహించాలని అసోసియేషన్ సభ్యులు బొంతు శ్రీదేవి యాదవ్‌ను కోరారు. ఈ నేపథ్యంలో బొంతు శ్రీదేవి యాదవ్ స్వయంగా సంఘటన స్థలానికి వెళ్లి అధికారులతో మాట్లాడి, సాయి మిత్ర టవర్స్లో నివసిస్తున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుజిత్ రెడ్డి, వెంకట్ రావు, వసంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ది గోల్డెన్ గాలా బ్యాంక్వెట్స్ ప్రారంభం



కాప్రా , ప్రజాస్ఫూర్తి : జమ్మిగడ్డ జీఆర్ రెడ్డి నగర్‌లో నూతనంగా ప్రారంభమైన "ది గోల్డెన్ గాలా - బ్యాంక్వెట్స్ & కేటరర్స్" ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాంతంలో ఇలాంటి ఆధునిక సదుపాయాలతో కూడిన ఫంక్షన్ హాల్ ప్రారంభం కావడం ఆనందదాయకమని తెలిపారు. స్థానిక ప్రజలకు వివాహాలు, వేడుకలు, సామాజిక కార్యక్రమాలకు ఇది ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, డివిజన్ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, నవీన్ గౌడ్, మహేష్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుమార స్వామి, మనెమ్మా, పంతులు నర్సింహులు, ఆనంద్ చారి, రహీం, మల్లేష్, కొండల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నిర్వహకులు, స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు , అనేక మంది ప్రముఖులు హాజరయ్యారు.

## ఏప్రిల్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

హైదరాబాద్: రాష్ట్రంలో ఏటా ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తామని, 202627 ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్, మే నెలల్లో రెండో విడత ప్రకటిస్తామని గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతంలో మంజూరై వివిధ స్థాయిల్లో నిలిచిపోయిన గృహాలను పూర్తిచేసేలా అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు వచ్చే ఏడాది పథకంలో వివరిస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ తొలిదఫా పథకంలో మార్చి నెలాఖరు నాటికి లక్ష గృహాలు, జూన్, జులై నాటికి 3 లక్షల నిర్మాణాలు పూర్తవుతాయని వెల్లడించారు. శాసనమండలిలో ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మధుసూదనాచారి, వెంకట్ నర్సింగరావులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. బ్యాంకు రుణాలతో కార్లు కొనుగోలు చేసి డ్రైవర్లుగా కొనసాగుతున్న వారిని లబ్ధిదారుల జాబితాలో చేర్చలేదని, అర్హులందరికీ న్యాయం జరిగేలా ఇందిరమ్మ గృహాల పథకం నిబంధనల్లో మార్పులు చేయాలని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మంత్రికి సూచించారు.

### పంట నష్టపోయిన రైతులను

## ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి

*** వంగ రాజేశ్వర్ రెడ్డి**



సిద్దిపేట జిల్లా, ప్రజాస్ఫూర్తి : సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం వీచిన భారీ ఈదురు గాలులకు మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ విషయం తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి గారు వెంటనే స్పందించి ప్రజాప్రతినిధులతో కలిసి ప్రభావితమైన గట్లమల్యాల, సంతోష్ నగర్ గ్రామాలను సందర్శించి క్షేత్ర స్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించారు.రైతుల పంట దాదాపుగా 1000 ఎకరాల పైగా నష్టపోయారని వాపోయారు.తమకు జరిగిన నష్టం సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలబడాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రకృతి వైపరీత్యం వల్ల జరిగిన పంట నష్టాన్ని చూసి ఎంతో బాధ కలిగిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఆర్థిక పరిస్థితి పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడినదని, ఈ నష్టం వారికి తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అలాగే వ్యవసాయ అధికారులు తక్షణమే నష్టాన్ని సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, రైతులకు తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి త్వరితగతిన పరిహారం అందేలా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. రైతులకు తగిన పరిహారం చెల్లించే వరకు తాను రైతులకు మద్దతు గా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్ సర్పంచ్ బానోత్ సరోజన,సర్పంచ్లు, మాజీ సర్పంచ్లు,ఉపసర్పంచులు,వార్డు సభ్యులు ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు

## భక్తిశ్రద్ధలతో సాయిబాబా మందిరంలో అన్నప్రసాద వితరణ



ప్రజాస్ఫూర్తి, కాప్రా: ఈసీఐఎల్ ఎక్స్ రోడ్ వద్ద అమావాస్య సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో బుధవారం సాయిబాబా మందిరంలో భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. అనంతరం పేద వృద్ధ మహిళలు మాలే వరమ్మ, కొండూరి విజయ, తోడుపునూరి ఉమారాణి, పడకంటి కమలమ్మలకు ప్రతినెల అందించే పింఛన్‌లో భాగంగా ఈ నెలకు గాను ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున మొత్తం నలుగురికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి మిత్రమండలి అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి రాముని తిరుమలేష్ గుప్త, కార్యనిర్వాహక కార్యదర్శి గంప కృష్ణ గుప్త , ఉపాధ్యక్షులు నంగునూరి అశోక్ గుప్త, వైవీయూ నాగేశ్వర్ రావు గుప్త, తాటి శ్రీనివాస్ గుప్త, కార్యదర్శులు బాచెల్లి నవీన్ గుప్త, అమర కృష్ణ గుప్త, చందా సంతోష్ గుప్త, బల్లి శ్రీధర్ గుప్త, కార్యవర్గ సభ్యులు మిర్యాల అరుణ్ కుమార్ గుప్త, ఉప్పల శ్రీనివాసులు గుప్త, బెల్దే భగవాన్ గుప్త, చంద్రగిరి తారకేశ్వర్ గుప్త, పెద్ది నవీన్ గుప్త, నీలా శివకుమార్ గుప్త, అర్థం శ్రీనివాస్ గుప్త, బుస్సా శ్రీనివాస్ గుప్త, కూర రామ్మోహన్ గుప్త, కొండూరి లక్ష్మణ్ రావు గుప్త, రవ్వ ఈశ్వరరావు గుప్త, వీబీవీ కృష్ణ గుప్త, పెద్ది శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

### పారా క్వాట్ విషం సేవించిన యువతికి

## పునర్జన్మనిచ్చిన మలక్ పేట యశోద డాక్టర్లు


*** నిపుణుల బృందం సమన్వయంతో అత్యవసర చికిత్స అందించి ప్రాణాలు కాపాడిన బహుళ వైద్య నిపుణులు..**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : పారా క్వాట్ అనే అత్యంత ప్రమాదకరమైన విష పదార్థాన్ని సేవించి ప్రాణప్రాయస్థితిలో ఉన్న యువతిని మలక్ పేట యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ బహుళ వైద్య నిపుణులు అత్యాధునిక వైద్య చికిత్స అందించి ప్రాణాలు కాపాడారని సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ జి. సుధాకర్, కన్సలెంట్ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ గుత్తా శశిధర్ రెడ్డి లు పేర్కొన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని శాలిని రెసిడెన్సిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల ఒక ఘటనలో 28 ఏళ్ల మహిళ సుమారు 10,15 మిల్లీలీటర్ల పారా క్వాట్ విషపదార్థాన్ని సేవించిందని ఆమెను మొదట స్థానిక ఆసుపత్రికి తరలించగా అక్కడ గ్యాస్ట్రిక్ లావేజ్ చేసి ఒకసారి హీమోపర్‌ఫ్యూషన్ చికిత్స అందించారని తెలిపారు . అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం ఆమెను మలక్ పేట యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కి తరలించారని ప్రాణప్రాయ స్థితిలో ఉన్న ఆ యువతికి వైద్య నిపుణులు సమయానికి అందించిన అత్యాధునిక వైద్య చికిత్సతో ప్రాణాలు కాపాడగలిగారని అన్నారు. పారా క్వాట్ విషపూరితం శరీరంలోని కిడ్నీలు, కాలేయం, ఊపిరితిత్తులు జీర్ణాశయ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదకరమైన రసాయనం అని సమయానికి చికిత్స అందించకపోతే ప్రాణాపాయం సంభవించే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. ఆమెను మొదట స్థానిక ఆసుపత్రికి తరలించగా అక్కడ గ్యాస్ట్రిక్ లావేజ్ చేసి ఒకసారి హీమోపర్‌ఫ్యూషన్ చికిత్స అందించారని తెలిపారు. అక్కడ జనరల్ మెడిసిన్, నెఫ్రాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ పుల్మనాలజీ నిపుణుల బృందం సమన్వయంతో ఆమెకు అత్యవసర చికిత్స ప్రారంభించడం జరిగిందన్నారు.ఆసుపత్రిలో చేర్చిన తరువాత చేసిన వివరణాత్మక వైద్య పరీక్షల్లో ఆమెకు తీవ్రమైన కిడ్నీ దెబ్బతినడంతో పాటు జీర్ణాశయ శ్లేష్మక పొర దెబ్బతిన్నట్లు గుర్తించారని తెలిపారు. గ్యాస్ట్రోఎంటరాలజీ నిపుణుల సూచన మేరకు చేసిన యూపర్ జీ ఐ ఎండోస్కోపీ పరీక్షలో ఈరోసివ్ గ్యాస్ట్రిటిస్ మరియు గ్రేడ్, డి ఈసోఫగైటిస్ ఉన్నట్లు తేలిందని ఇది విషపూరితం కారణంగా కడుపు, ఆహారనాళంలో తీవ్రమైన వాపు ఏర్పడినట్లు సూచిస్తుందని ల్యాబ్ పరీక్షల్లో వైట్ బ్లడ్ సెల్స్ పెరగడం కిడ్నీ పనితీరు క్రమంగా తగ్గడం గమనించారని తెలిపారు . యూరిన్ డైథియోనైట్ పరీక్ష పాజిటివ్ రావడంతో పారా క్వాట్ విషపూరితం నిర్ధారణ అయిందని పారా క్వాట్ విషపూరితం అనుమానం ఈరోసివ్ గ్యాస్ట్రిటిస్ గ్రేడ్ డి ఈసోఫగైటిస్అక్యూట్ కిడ్నీ ఇంజరీ హీమోపర్‌ఫ్యూషన్ అనంతరం హెపటైటిస్సేసిన చికిత్సలు కీలక వైద్య నిర్వహణ జనరల్ ఫిజిషియన్ డా. గుత్తా శశిధర్ రెడ్డి పర్యవేక్షణలో వైద్య బృందం చేపట్టిన చికిత్సలు శరీరంలో ఉన్న విషపదార్థాన్ని తొలగించేందుకు రెండు సార్లు హీమోపర్‌ఫ్యూషన్ కిడ్నీ పనితీరును మెరుగుపర్చేందుకు రెండు సార్లు డయాలసిస్ ఇన్‌ట్రావీనస్ యాంటీబయాటిక్స్ మరియు సహాయక మందులు ఈసోఫగైటిస్ గ్యాస్ట్రిటిస్‌కు ప్రత్యేక గ్యాస్ట్రోప్రొటెక్టివ్ చికిత్స కిడ్నీ కాలేయ పనితీరుపై నిరంతర పర్యవేక్షణ తో చికిత్సకు రోగి క్రమంగా స్పందించింది కిడ్నీ పనితీరు మెరుగుపడుతూ రావడంతో పాటు హెపటైటిస్ లక్షణాలు కూడా తగ్గాయన్నారు.ఆమెకు సాఫ్ట్ డైట్ ఇవ్వగా బాగా సహించిందని రైల్స్ ట్యూబ్, ఫోలీస్ క్యాథెటర్ తొలగించడంతో క్రమంగా ఆమె శారీరకంగా కోలుకొని స్వయంగా నడిచే స్థితికి వచ్చిందని దీంతో పరిస్థితి మెరుగుపడడంతో అవసరమైన మందులు ఫాలోఅప్ సూచనలతో కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు డిశ్చార్జ్ చేయడం జరిగిందని తెలిపారు.. యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మలక్‌పేట్, హైదరాబాద్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర డాక్టర్లు డి ఉగంధర్,డా. కిషన్ నున్నవాతా, కే శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ చిదుర, ఏ. వాసు కిరణ్ రెడ్డి తదితరులున్నారు.

## జిమ్ పరికరాల గల్లంతు కలకలం

*** అధికారులను ఆశ్రయించిన కాలనీ వాసులు**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా సర్కిల్ పరిధిలోని కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో జిమ్ పరికరాల గల్లంతు వ్యవహారం స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాప్రా సర్కిల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జి. దశరథ, కోశాధికారి డి. వెంకట కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు టి. పార్థసారథి, ముఖ్య సలహాదారు వై. రాజేశ్వర్ పాల్గొని కాలనీలో జరుగుతున్న పరిణామాలను అధికారికి వివరించారు. గతంలో సుమారు రూ.16 లక్షల విలువైన జిమ్ పరికరాలు స్థానిక యువత కోసం మంజూరు చేసి ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం ఆ పరికరాల లభ్యతపై స్పష్టత లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదం అనంతరం ఈ అంశం వెలుగులోకి వచ్చినట్లు వారు తెలిపారు. గతంలో ఎన్ని పరికరాలు అందించబడినవి, ప్రస్తుతం ఎన్ని ఉన్నవి, గల్లంతైన పరికరాల సంఖ్య, వాటి విలువ వంటి అంశాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కోరారు. అలాగే, అందుబాటులో ఉన్న పరికరాలను కాలనీ వాసులకు ఉపయోగపడేలా వెంటనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాలనీ నిర్వహణలో కొన్ని అనుమానాస్పద పరిస్థితులు ఉన్నాయని, సంబంధంలేని వ్యక్తులు యాజమాన్యాన్ని ప్రభావితం చేస్తూ కాలనీవాసులను మరియు అధికారులను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.

## అమావాస్య అన్నప్రసాద వితరణ..



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మారుతి మిత్రమండలి ఆధ్వర్యంలో కుషాయిగూడ పోచమ్మ దేవాలయం వద్ద ప్రతి అమావాస్య సందర్భంగా నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత యాదగిరి, నాగేశ్వరి, మన్మధరావులు పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మారుతి మిత్రమండలి అధ్యక్షులు గురుంచి అశోక్ చారి, ప్రధాన కార్యదర్శి వరగంటి ఆంజనేయులు (హనుమంతు), కోశాధికారి మచ్చ బాబు గౌడ్, శీలం శ్రీనివాస్, గుంటి ఆంజనేయులు, గురుమంచి వేణు చారి, చల్లా వీరేశం, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించి దేవుని ఆశీస్సులు పొందారు.

## మాజీ హోం మంత్రి దేవేందర్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మాజీ హోం శాఖ మంత్రి తూళ్ల దేవేందర్ గౌడ్ జన్మదినం సందర్భంగా బిఆర్ఎస్ యువ నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తుక్కుగూడలోని ఆయన స్వగృహానికి వెళ్లి దేవేందర్ గౌడ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సమైఖ్య ఆంధ్రప్రదేశ్ కాలంలో మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా మూడు సార్లు హ్యాట్రిక్ సాధించిన దేవేందర్ గౌడ్, తొమ్మిది సంవత్సరాల పాటు బీసీ సంక్షేమం, ప్రొహిబిషన్, సినిమాటోగ్రఫీ, రెవెన్యూ, హోం శాఖల మంత్రిగా సేవలందించారు. అలాగే రాజ్యసభ సభ్యునిగా కూడా పనిచేసి పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఈ కార్యక్రమంలో పోలూరి నాగార్జున, రఘుమా రెడ్డి, ఏరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండ తీవ్రత నుండి ప్రజలను కాపాడడానికి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలి

* సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: వేసవికాలంలో ఎండ తీవ్రత నుండి పట్టణ ప్రజలను కాపాడటానికి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. సింగరేణి ప్రాంతం కావడం వలన రాష్ట్రంలో కెల్లా కొత్తగూడెంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఎండ తీవ్రతకు ప్రజలు నష్టపోకుండా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన సెంటర్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి అవసరాలరీత్యా మార్కెట్ కు వచ్చిన ప్రజలకు మంచినీటి సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. టౌన్ లో నాటిన మొక్కలను సంరక్షించాలని కోరారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు యాజమాన్యం మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ వర్కర్లకు కూడా మజ్జిగ ప్యాకెట్లు ఇచ్చే విధంగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్ల పైన ట్యాంకర్ల తోటి నీళ్లు చల్లించి వేడిని తగ్గించే చర్యలు చేపట్టాలని అన్నారు. ఉష్ణోగ్రతకు సంబంధించిన విషయాలు ప్రజలకు తెలియజేసి వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం అందించే విధంగా జిల్లాకేంద్ర ప్రభుత్వ హాస్పిటల్ , స్థానిక ప్రాథమిక హెల్త్ సెంటర్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఎంతోమంది యువతకు ఆదర్శంగా నిలిచిన మహేష్

* తొర్రూర్ మండల మాజీ జెడ్పిటిసి,జిల్లా ప్రజా పరిషత్ ఫ్లోర్ లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన మహేష్ ఎంతోమంది యువతకు ఆదర్శంగా నిలిచాడని తొర్రూర్ మండల మాజీ జెడ్పిటిసి,జిల్లా ప్రజా పరిషత్ ఫ్లోర్ లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో మూడున్నర దశాబ్దాలుగా నమ్మిన సిద్ధాంతం కోసం నిజాయితీ నిబద్ధత కలిగిన కుర్ర మహేష్ (46) బుధవారం అకస్మాత్తుగా గుండెపోటు కారణంగా మృతి చెందారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పార్థివదేహానికి పూలమాలవేసి నివాలర్పించి ప్రగాఢ సానుభూతిని కుటుంబ సభ్యులకు తోటి ఉద్యమ సహచరులకు మానసిక ధైర్యాన్ని ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో విద్యార్థి, యువజనలు ఎదుర్కొంటున్న సమస్యలు వారిని పట్టిపీడిస్తున్న నిరుద్యోగ సమస్యల పై నిరంతరం పోరాటం చేసిన నాయకుడన్నారు. .కుల వివక్షత వ్యతిరేక పోరాటాల ఉద్యమం ద్వారా జిల్లా వ్యాప్తంగా అనేక క్రియాశీలక సామాజిక చైతన్య సదస్సులు నిర్వహించిన మంచి ఉద్యమకారుడన్నారు. దురదృష్టవశాత్తు మరణించడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు 2029లోనే

* అందువల్ల మహిళా రిజర్వేషన్లు ఎప్పుడు అమల్లోకి వచ్చినా మాకు ఇబ్బందిలేదు
* దిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి



దిల్లీ: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం 2028లో రావని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 2029లో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి జమిలి ఎన్నికలు జరుగుతాయని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లను 2034కి బదులుగా 2029 ఎన్నికల్లోనే అమలుచేసేందుకు వీలుగా నారీశక్తి వందన్ అధినియమ్‌ను సవరణ చేసేందుకు సమాయత్తమవుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆ విషయంపై విలేకర్లు ముఖ్యమంత్రి అభిప్రాయాన్ని కోరినప్పుడు ఆయన పైవిధంగా స్పందించారు. మహిళా రిజర్వేషన్లు ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చినా తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు మాత్రం 2029లోనే జరుగుతాయని, అందువల్ల ఈ రిజర్వేషన్లతో తమకేమీ ఇబ్బంది ఉండదన్నారు. రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన మిత్రుడు వేం నరేందర్‌రెడ్డిని వెంటబెట్టుకొని సీఎం బుధవారం ఉదయం పార్లమెంటుకు వచ్చి అక్కడ రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీలకు ఆయన్ను పరిచయంచేసి మాట్లాడారు. అనంతరం విలేకర్లు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో కొందరు వ్యక్తులకు స్టేషన్ బెయిల్ ఇవ్వడం గురించి స్పందిస్తూ ఆ విషయంలో నిబంధనల ప్రకారమే పోలీసులు నడుచుకున్నారని, అందులో ఎవ్వరికీ ఎలాంటి ప్రమేయం ఉండదన్నారు. ఆ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు కోసం తాము సిట్ ఏర్పాటు చేశామని చెప్పారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీని కలిసిన సమయంలో ముఖ్యమంత్రి వెంట పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీలు మల్లురవి, సురేశ్‌షెట్కార్, అనిల్‌కుమార్‌యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, దిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## సీఎంపై కేటీఆర్ మాటలు రికార్డుల నుంచి తొలగింపు

* సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటన

హైదరాబాద్: గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనసభలో కేటీఆర్ మాట్లాడిన సందర్భంగా సీఎంను ఉద్దేశించి వినియోగించిన పదాలు అన్‌పార్లమెంటరీగా ఉన్నందున వాటిని రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. ఈ సందర్భంగా శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ‘‘సీఎంపై మీరు (కేటీఆర్) ఉపయోగించిన అన్‌పార్లమెంటరీ పదాలను కచ్చితంగా రికార్డుల నుంచి తొలగించాల్సిన అవసరముంది. సభ బయట కూడా మీరు అడ్డగోలుగా మాట్లాడారు. అవన్నీ ప్రస్తావించడానికి ఈ సభ లేదు’’ అని అన్నారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ‘గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివిన కేటీఆర్ సీఎంను ఉద్దేశించి వాడిన పదాలు అన్‌పార్లమెంటరీగా ఉన్నాయి.


# వ్యవసాయ కార్మికులకు సమగ్ర వేతన చట్టం తేవాలి




మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : భారతదేశ వ్యాప్తంగా సుమారు పదమూడు కోట్ల మంది ఉన్న వ్యవసాయ కార్మికుల కోసం సమగ్ర వేతన చట్టం తేవాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాయం చిన్న చంద్రన్న అన్నారు.అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా ప్రథమ మహాసభ బుధవారం మహబూబాబాద్ లోని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ కార్యాలయం నేడు మాధవన్న నగర్ లో జరిగింది. ఈ సందర్భంగా చంద్రన్న మాట్లాడుతూ పెరుగుతున్న పెట్టుబడిదారి ఉత్పత్తి సంబంధాల వల్ల వ్యవసాయ కూలీల సంఖ్య రోజుకి వేగంగా పెరుగుతుందని అన్నారు. గ్రామాలే కాకుండా సమీప పట్టణాలలో కుంటుంబల పోషణ కోసం వలసలు వెళుతున్న వారిలో అత్యధిక మంది వ్యవసాయ కూలీలేనని వారికి ఒక సమగ్ర వేతన చట్టం తేవడంలో పాలకులు విఫలమైనారని అన్నారు.. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం జి రాంజీ పథకం పేరుతో కోట్లాదిమంది వ్యవసాయ కూలీలను ఆకలితో మార్చటానికి కుట్రలు చేస్తుందని అన్నారు.పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వి,టి యు సి ఐ జిల్లా కార్యదర్శి బిల్లా కంటే సూర్యం ఏఐయుకేఎస్ జిల్లా కార్యదర్శి ఆవుల కట్టయ్య సంఘీభావ సందేశాలు ఇచ్చారు. అనంతరం 13 మందితో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉమ్మగాని సత్యం,ప్రధాన ముంజంపల్లి వీరన్న, ఉపాధ్యక్షులుగా బూరుగుల మోష, సేద్యం యాకయ్య, సహాయ కార్యదర్శిలుగా పెరుమల జానకి రాములు, పందిరి జగత్ రెడ్డి, కోశాధికారిగా చితరబోయిన పాపయ్య,కార్యవర్గ సభ్యులుగా గొది సమ్మయ్య జోగ రాములు పులుసుం నాగేశ్వరరావు, ఈర్ల వెంకన్న, కోతుల శ్రీనివాస్ సూరయ్య లు ఎన్నికయ్యారు.

## ప్రార్థనా స్థలాల్లో పారిశుద్ధ్యం, విద్యుత్, నీటి సౌకర్యాలు మెరుగుపరచాలి

* అధికారులకు ఎమ్మెల్యే కూనంనేని ఆదేశాలు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఆయన ఫోన్ ద్వారా కార్పొరేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, పోలీసు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పండుగల సందర్భంగా దేవాలయాలు, మసీదులు, ఈద్గాల వద్ద పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలని సూచించారు.ప్రార్థనా స్థలాల వద్ద ప్రత్యేక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్, పంచాయతీ అధికారులకు సూచించారు. పండుగల వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. నియోజకవర్గ ప్రజలు పండుగలను సుఖసంతోషాలతో జరుపుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## గ్యాస్ ఏజెన్సీలు, (గోదాం)లను ఆకస్మికంగా తనిఖీ

* జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణంలోని రైల్వే గేట్ ప్రాంతం హెచ్. పీ గ్యాస్ ఏజెన్సీ, మల్యాల లోని శ్రీధర ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ లను ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు,ఈ సందర్భంగా గోదాములోని నిలువ ఉన్న గ్యాస్ వివరాల రిజిస్టర్,డెలివరీ రిజిస్టర్స్, ఆన్లైన్ లో వచ్చిన వారి జాబితా వివరాలను తనిఖీ చేశారు,ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో పకడ్బందీగా గ్యాస్ సరఫరా చేయాలని,డబుల్ సిలిండర్లు తీసుకున్న వారిని గుర్తించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా సరఫరాను కొనసాగించాలని, విజిలెన్స్ కమిటీ సభ్యులు నిత్యం జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీలలో పంపిణీ జరుగుతున్నటువంటి ప్రక్రియలు పరిశీలించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు,నిబంధనలకు విరుద్ధంగా సరఫరా చేస్తున్నటువంటి గ్యాస్ సిలిండర్ లను గుర్తించి కేసముద్రం మండలం, ఉప్పరపల్లి లో డొమెస్టిక్ గ్యాస్, హెచ్పి, భారత్, ఇండియన్, తదితరులపై నాలుగు కేసులు నమోదు చేయడం జరిగిందని అన్నారు,ప్రస్తుతం డిమాండ్కు అనుగుణంగా జిల్లాలో గ్యాస్ నిల్వలు ఉన్నాయని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు,అనవసరంగా ముందస్తు గ్యాస్ బుకింగ్ లు చేయరాదని,గవర్నమెంట్ సూచించిన ప్రకారం 25 రోజుల తర్వాతనే గృహ అవసరాల నిమిత్తం గ్యాస్ బుక్ చేసుకోవాలని తెలిపారు. గ్యాస్ కొరత ఉందని తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు,ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కోరారు,జిల్లా పౌరసరఫరాల అధికారి రమేష్ నాయక్, తహసిల్దార్ రాజేశ్వర్, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

## మహిళల సాధికారత కోసం అందరు కృషి చేయాలి

* సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మహిళలు విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో ముందంజలో నిలవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్. కె. సాబీర్ పాషా పిలుపునిచ్చారు. ప్రగతి గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో గౌతంపూర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.సమాజంలో మహిళలకు గౌరవ స్థానం మరింత పెరగాలని, వారిపై ఉన్న వివక్ష పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. లింగ వివక్షను ప్రోత్సహించే క్షీణ సంస్కృతిని పారదోలేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు.లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసినప్పుడే నిజమైన సమానత్వం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా సాధికారత కోసం జరిగిన పోరాటాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వీఓఏ పద్మ, రత్నకుమార్ ఆధ్వర్యంలో పలు ప్రముఖులు పాల్గొన్నారు. కొత్తగూడెం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వి. మల్లికార్జునరావు, గౌతంపూర్ సర్పంచ్ కళ్యాణి, విద్యానగర్ సర్పంచ్ భూక్యా శాంతి, తాటిపల్లి శంకర్ బాబు దంపతులు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, దోసపాటి క్రాంతి, డాక్టర్లు సాగారిక, నేహా తదితరులు హాజరయ్యారు.

## పంచాయితీ ప్లాట్లు.. పల్లె వాసుల పాట్లు..

* కొనుగోలుదారులు, అమ్మకం దారుల పై భారం..
* సబ్ రిజిస్ట్రర్లకు సర్పంచ్ ఎంసి ప్రవీణ్, ఉప సర్పంచ్ అశోక్ ఫిర్యాదు



ప్రజాస్ఫూర్తి ప్రతినిధి, షాద్నగర్ : మున్సిపాలిటీ పరిధిలోని చటాన్ పల్లి శివారులో లింగారెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోకి వచ్చి ప్లాట్ల విషయంలో ఫీడింగ్ లోపాలను సరిదిద్దాలని లింగారెడ్డి గూడా గ్రామ సర్పంచ్ ఎంసీ ప్రవీణ్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ సబ్ రిజిస్ట్రర్కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధిలో ఉన్న ప్లాట్లను మున్సిపాలిటీలో మ్యుటేషన్ కాకుండా పంచాయతీ పరిధిలోనే అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. లింగారెడ్డి గూడా పరిధిలో చటాన్ పల్లికి సంబంధించిన రెవెన్యూ భూములు విస్తరించి ఉన్నాయని, వీటిని మున్సిపాలిటీ పరిధిలో కలపడం వల్ల కొనుగోలు, అమ్మకాల సమయాల్లో ప్రజలపై అధిక భారం పడడమే కాకుండా పంచాయితీ కూడా ఆర్థికంగా నష్టపోతుందని వెల్లడించారు.పంచాయతీ పరిధిలో ఉన్న ప్లాట్ల అనుమతులు ఇక్కడ ఉండగా వాటిని మున్సిపాలిటీ పరిధిలోకి తీసుకువెళ్లడం వల్ల జిపి ఫండ్ ను నష్టపోతున్నామని వెల్లడించారు. చటాన్ పల్లి భూములు అటు లింగారెడ్డి గూడా పరిధిలో, ఇక షాద్ నగర్ పరిధిలో ఉండడంవల్ల ఈ ఇబ్బందులు ఎదురవుతున్నాయని వెల్లడించారు. ఈ భూములకు సంబంధించిన వివరాలు కంప్యూటర్ల రూపొందించేటప్పుడు అది షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధికి వస్తుందా, లింగారెడ్డి కూడా పంచాయతీ పరిధి వస్తుందా అన్నది గుర్తిస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. రిజిస్ట్రేషన్ ఫీడింగ్ సమయంలో స్థానిక సంస్థను ఎన్నుకునేటప్పుడు ఈ సమస్య ఎదురవుతుందని పేర్కొన్నారు. దీనితో లింగారెడ్డి కూడా కు సంబంధించిన ప్లాట్లు పంచాయితీలో అప్డేట్ కావడం లేదని వెల్లడించారు. దీనిని గుర్తించి ఫీడింగ్ సమయంలోనే పంచాయతీ పరిధిలోని ప్లాట్లు పంచాయతీ పరిధిలోకి వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## కాంటిజెంట్ వర్కర్లకు నిత్యావసర సరుకుల పంపిణీ

* ఆపద్బాంధవుడు సమ్మీ గౌడ్, డా. కుమార్ దుంగ్రోతు ఎన్ హెచ్ ఎం



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, మహబూబాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ఎస్ఎన్సీయూ కాంటిజెంట్ వర్కర్లకు సుమారు ఆరు నెలలుగా జీతాలు రాక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న విషయం తెలిసిందే.ఈ సమస్యను ఎన్ హెచ్ ఎం జేఏసీ మహబూబాబాద్ ఉద్యోగులు సమ్మీ గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మీ గౌడ్ (కేసముద్రం) దృష్టికి తీసుకెళ్లారు.సమ్మీ గౌడ్ స్పందించి, ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా ఎస్ఎన్సీయూ కాంటిజెంట్ వర్కర్లకు ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను నేరుగా వారి ఇళ్లకు (బెథోలు గ్రామం) ఎన్ హెచ్ ఎం జేఏసీ ద్వారా కాంటిజెంట్ వర్కర్లు సలేహా, మౌలబీ, రెహానా, వెంకటమ్మ, శివ మొత్తం 5 మందికి సమ్మీగౌడ్ ఫౌండేషన్ ద్వారా పంపిణీ చేయించారు.ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు డా. కుమార్ దుంగ్రోతు మాట్లాడుతూ ఆపదలో ఆదుకున్న ఏకైక వ్యక్తి సమ్మీ గౌడ్. ఆయన అందించిన సహాయం, ప్రోత్సాహం ఎప్పటికీ మరువలేనిదన్నారు. మా ఉద్యోగులకు ‘నేను ఉన్నాను’ అని ముందుకు వచ్చిన నాయకుడు ఆయనే” అని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సహాయ సహకారాలు కొనసాగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం జేఏసీ కార్యనిర్వహణ అధ్యక్షుడు డా. కందుల నాగరాజు, ప్రధాన కార్యదర్శి పొన్నం కవిత, ఉపాధ్యక్షురాలు దార్ల జ్యోతి, సభ్యులు నీల, సరిత, యజ్ఞేశ్వర్, ఖాజా పాషా, సత్తార్, యాకుబ్ పాషా, కిరణ్, బెథోలు గ్రామానికి చెందిన సుమారు 50 మంది పాల్గొన్నారు.

## కాచనపల్లి గ్రామపంచాయతీ ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : ఉగాది పండుగ సందర్భంగా కాచనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కిష్టాపురం మాజీ వార్డ్ మెంబర్ పర్శక రాజు మాట్లాడుతూ తెలుగు వారందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తీపి, చేదు కలిసిందే జీవితం కష్టం, సుఖం తెలిసిందే జీవితం. మీ జీవితంలో ఈ ఉగాది ఆనందోత్సవాల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నివసిస్తున్న తెలుగు వారందరూ జరుపుకునే ఉగాది పండుగ మీకు మీ కుటుంబ సభ్యులతో బంధుమిత్రులతో ఆనందంగా జరుపుకొవలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయం రంగంగా పరిగణించే ఈ ఉగాది పండుగ రైతన్న జీవితంలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ జీవిస్తూ పచ్చని పాడి పంటలతో రైతంగం వర్థిల్లాలని కోరారు.

## భాష్యం స్కూల్ విద్యార్థుల ప్రతిభ

* రతన్ టాటా నేషనల్ లెవెల్ ఓపెన్ కుంగ్ ఫు కరాటే ఛాంపియన్షిప్ 2026




ప్రజాస్ఫూర్తి ప్రతినిధి , షాద్నగర్ : షాద్నగర్ లో నిర్వహించిన రతన్ టాటా నేషనల్ లెవెల్ ఓపెన్ కుంగ్ ఫూ, కరాటే ఛాంపియన్‌షిప్ 2026 లో మా భాష్యం పాఠశాల విద్యార్థులు గ్రాండ్ ఛాంపియన్‌షిప్ కాటాస్ ఈవెంట్ లో అద్భుత విజయం సాధించారు. ఈ సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ మా చిన్నారుల ప్రతిభ మా పాఠశాలకు గర్వకారణం: జునేరా సమ్రీన్ (4వ తరగతి) బి. నేహా (4వ తరగతి) బాష్యం హై స్కూల్, షాద్నగర్ లో విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి మేము కట్టుబడి ఉన్నామన్నారుఉ.. క్రమశిక్షణతో కరాటే తరగతులను నిరంతరం నిర్వహిస్తూ, విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం మరియు స్వీయ రక్షణ నైపుణ్యాలను పెంపొందిస్తున్నామనీ ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యూసుఫ్ తెలిపారు. ఈ విజయం మా విద్యార్థుల కష్టపాటు, శిక్షకుల మార్గదర్శకం మరియు పాఠశాల సహకారానికి నిదర్శనం.ఇలాగే మరిన్ని విజయాలు సాధించాలని భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ యూసుఫ్, ఈగల్ కుంగ్ ఫు మాస్టర్ హాజీ ఆకాంశిస్తూ అభినందనలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ



హైదరాబాద్ : పేదవాడి ఆత్మ గౌరవానికి చిహ్నంగా నిలిచే ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం ఒకసారి చేసే కార్యక్రమం కాదని, ప్రతి సంవత్సరం కొనసాగించే శాశ్వత ప్రక్రియగా ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మాయమాటలు చెప్పదని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని ఆచరణలో చూపిస్తుందన్నారు. రాబోయే మూడు సంవత్సరాలలో పట్టణ ప్రాంతాలల్లోని ప్రతీ వార్డులో ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని ప్రకటించారు. శాసన మండలిలో మంగళవారం నాడు హౌసింగ్ పై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. "ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో రెండో విడత ఇళ్ల మంజూరు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నాం. ఇప్పటికే మొదటి విడతలో ఇళ్ల మంజూరు జరగగా, మిగిలిన మూడు విడతలను కూడా దశలవారీగా పూర్తిచేస్తాం. రాష్ట్రంలోని మారుమూల గిరిజన తండాలు, గూడాల్లో గతంలో ప్రారంభమై వివిధ స్థాయిలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తుంది. వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్లకు ఫ్లెక్సిబిలిటీ ఇచ్చి, లబ్ధిదారులకు అనుకూలంగా మార్పులు చేపడతాం. లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి వివక్ష ఉండదు. కులం, మతం, పార్టీతో సంబంధం లేకుండా అత్యంత పేదలకే ప్రాధాన్యం ఇస్తున్నాం. ఎక్కడైనా లోపాలు ఉన్నట్లు సమాచారం అందితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మార్చి నాటికి సుమారు లక్ష ఇళ్లు పూర్తి కానున్నాయి. జూన్‌జులై నాటికి మొదటి విడతలో మంజూరైన మూడు లక్షల ఇళ్లలో మెజారిటీ పూర్తి అవుతాయని మంత్రి తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించామని, పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ప్రస్తుతం వాళ్ళు నివసిస్తున్న ప్రాంతానికి వీలైంత దగ్గరలో ఇండ్ల నిర్మాణాలు చేపట్టడానికి కార్యాచరణ రుపొందిస్తున్నాం. గతంలో దూర ప్రాంతాల్లో నిర్మించిన 2BHK ఇళ్లను లబ్ధిదారులు ఉపయోగించలేకపోయిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం. అదేవిధంగా, 2BHK పథకంలో పెండింగ్ బిల్లులలో 99 శాతం ఇప్పటికే చెల్లించామని, మిగిలినవాటిని కూడా త్వరలో క్లియర్ చేస్తాం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## రెండోసారి.. సీఎస్ రామకృష్ణారావు పదవీ కాలం మరో 3 నెలలు పొడిగింపు



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారావు మరో 3 నెలల పాటు కొనసాగనున్నారు. రామకృష్ణారావు పదవీకాలాన్ని మూడు నెలల పాటు పొడిగిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీఓపీటీ) ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో జూన్ 30వ తేదీ వరకు సీఎస్‌గా రామకృష్ణారావే కొనసాగనున్నారు. వాస్తవానికి రామకృష్ణారావు పదవీకాలం మార్చి 31వ తేదీన ముగియనుంది. ఈ క్రమంలో మళ్లీ ఆయననే ఈ పదవిలో కొనసాగించాలని కోరుతూ ఈ నెల 9న డీవోపీటీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. ఈ లేఖపై స్పందించిన కేంద్రం.. రామకృష్ణారావునే సీఎస్‌గా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రామకృష్ణారావుకు పదవీకాలం పొడిగించడం ఇది రెండోసారి. వాస్తవానికి కె.రామకృష్ణారావు గతేడాది ఆగస్టు 31న పదవీవిరమణ చేయాల్సి ఉండగా, ఆయన పదవీ కాలాన్ని ఏడు నెలలు పొడిగించడానికి అప్పట్లో కేంద్రం అనుమతిచ్చింది. ఒక వేళ రామకృష్ణారావుకు పదవీ కాలం పొడిగించకపోతే.. ఎవరనే దానిపై కూడా ఉత్కంఠ ఉండేది. ఈ క్రమంలో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారుల పేర్లు కూడా తెరపైకి వచ్చాయి. జయేశ్ రంజన్ లేదా వికాస్ రాజ్‌లలో ఎవర్నో ఒకరిని సీఎస్ పదవి వరిస్తుందని భావించారు.

## కేటీఆర్ వర్సెస్ ఆది శ్రీనివాస్.. సభలో ఆ పదాలపై తీవ్ర వాగ్వాదం



హైదరాబాద్ : తెలంగాణ శాసనసభలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. నిన్న సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. అన్ పార్లమెంటరీ భాష వినియోగించారన్న ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు స్పీకర్ జోక్యం చేసుకోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదం సద్దుమణిగింది. అనర్హత పిటిషన్లపై సభలో చర్చకు ఆస్కారం లేదని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు స్పష్టత ఇచ్చిన అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడారు. నిన్నటి రోజున గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కొన్ని పదాలు అన్ పార్లమెంటరీగా మాట్లాడారు. ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపైన చేసిన భాష అన్ పార్లమెంటరీగా ఉందని గమనించాం. పదేండ్లు మంత్రిగా ఉన్నారు. అనుభవం ఉన్న వారు. ఆయన మాటల్లో ఈర్ష్య భావం కనిపించింది. సీఎం అంటే కడుపు మంట కనిపించింది. పదాలు అన్ పార్లమెంటరీగా ఉన్నాయి. వాటిని వెనక్కి తీసుకోవాలని కోరుతున్నా. ఇలాంటి పదాలు వాడడం దారుణం. మీరు పరిశీలించి రికార్డుల నుంచి తొలగించాలని కోరుతున్నామని ఆది శ్రీనివాస్ స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. నేను మాట్లాడిన దాంట్లో ఏం అన్ పార్లమెంటరీ భాష ఉందో కోట్ చేయలేదు. ఒక వేళ నేను అన్ పార్లమెంటరీ భాష ఉపయోగిస్తే మీరు అప్పుడే ఆపేవారు. ఆ పదాలను తొలగించాల్సిన అవసరం ఉందని అనుకోవడం లేదు. అనకూడని మాటలు అన్నానా..? బడవే, బలి దేవత అన్నానా..? నేనేం అలా అనలేదు. సీఎం అన్నది నేను చెబుతున్నా. సీఎం మాట్లాడింది రికార్డుల్లో ఉంటే నేను మాట్లాడింది కూడా రికార్డుల్లో ఉండాలి. ఇక ఇది రాజ్యాంగ పరిధిలో పని చేసే శాసనసభ. శాసనాలు చేసే సభ ఇది. హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల మీద ఇదే సభలో ఎన్నో చర్చించాం. బీసీ రిజర్వేషన్లపై కూడా చర్చించాం. మిమ్మల్ని కోరేది ఒక్కటే. మంత్రి పదవి కావాలంటే పైరవీ చేసుకోమనండి (ఆది శ్రీనివాస్‌ను ఉద్దేశించి). అనర్హత పిటిషన్ల విషయంలో మీరు ఒక నిర్ణయం తీసుకున్నారు. ఎవరైనా పార్టీ మారితే ఆటోమేటిక్‌గా డిస్‌క్వాలిఫికేషన్ అవుతారని రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటను గుర్తు చేశాను అని కేటీఆర్ పేర్కొన్నారు. ఆ తర్వాత మంత్రి శ్రీధర్ బాబు కలగజేసుకుని.. సభలో చాలా జాగ్రత్తగా మాట్లాడాల్సిన అవసరం ఉంది. రికార్డుల నుంచి తొలగించాలని కోరుతున్నాం. మీరు కూడా అడ్డగోలుగా బయట మాట్లాడారు. వారు మాట్లాడిన మాటలు మర్యాద పూర్వకంగా లేవు. ప్రజలందరూ గమనిస్తున్నారు. మీ వైపు కూడా చూస్తున్నారు. మీరు మాట్లాడే పద్ధతి బాగా లేదు. తీవ్రంగా ఖండించదగిన విషయం అని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. చివరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కల్పించుకుని.. అధికార, ప్రతిపక్ష సభ్యులను నిలువరించారు. కేటీఆర్ మాటలను పరిశీలించి రికార్డుల నుంచి తొలగించబడును అని స్పీకర్ ప్రకటించారు.

## ఒకే రోజు 2.35లక్షల సిలిండర్ల డెలివరీ.. వెల్లడించిన పౌర సరఫరాల సంస్థ..!



తెలంగాణలో ఎల్‌పీజీ సిలిండర్ల కొరత లేదని పౌర సరఫరాల సంస్థ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. రాష్ట్రంలో మంగళవారం ఒకే రోజు 2,35,678 సిలిండర్లను డెలివరీ చేసినట్లు తెలిపింది. గ్యాస్ సిలిండర్ రీ ఫిల్లింగ్ కోసం ఆందోళన చెందొద్దని వినియోగదారులకు ప్రభుత్వం సూచించింది. సిలిండర్ల డెలివరిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించేందుకు పౌర సరఫరాల సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌లో అధికారులతో పాటు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, కంపెనీల ప్రతినిధులు ఉన్నారని తెలిపింది. ఈ మూడు కంపెనీలు కలిపి సగటున రోజుకు 2,15,151 సిలిండర్లు డెలివరీ చేసేవని, నిన్న అంతకు మించి డోర్ డెలివరీ చేసిందని వివరించారు. ఇండియన్ ఆయిల్ 93,887, హిందుస్థాన్ పెట్రోలియం కంపెనీ 84,156, బీపీసీఎల్ 57,635 డెలివరీ చేశాయని పౌర సరఫరాలశాఖ పేర్కొంది.

## ఆర్జీయూకేటీలో ఆందోళన.. 11 గంటలపాటు విద్యార్థుల నిరసన



ముథోల్: నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. ఇది మంగళవారం ప్రారంభమై బుధవారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. పీయూసీ రెండో సంవత్సరం చదువుతున్న తేజస్విని అనారోగ్యంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. దీనిపై విద్యాలయంలో వైద్యసౌకర్యాలు సరిగాలేవని తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ (టీఎస్ఏఎస్) నాయకులు, విద్యార్థులు మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఆర్జీయూకేటీలోని పరిపాలన భవనం వద్దకు వచ్చి ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మంగళవారం రాత్రి జిల్లా ఎస్పీ జానకీ షర్మిల బలగాలతో అక్కడికి చేరుకుని అక్కడే ఉన్నారు. ఉపకులపతి వైఖరిని నిరసిస్తూ, తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఆందోళన విరమించేది లేదని విద్యార్థులు భీష్మించారు. ఉపకులపతి అక్కడికి వచ్చి తాను పదవికి రాజీనామా చేస్తానంటూ తన నివాసానికి వెళ్లిపోయారు. విద్యార్థులు వీసీ ఇంటికి చేరుకున్నారు. రాత్రంతా ఆయన ఇంటి ముందే ఆరుబయట నిద్రించి నిరసన తెలిపారు. చివరికి ఎస్పీ చొరవతో వీసీ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వచ్చి వారితో మాట్లాడి వినతి పత్రం స్వీకరించడంతో గొడవ సద్దుమణిగింది.

**ఇదీ జరిగింది..**

గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న తేజస్విని ఈ నెల 12న ఆర్జీయూకేటీలోని ఆసుపత్రికి వెళ్లింది. అక్కడి వైద్యులు తలనొప్పి, జ్వరం ఉందని మాత్రలు ఇచ్చి పంపించారని విద్యార్థులు ఆరోపించారు. 13న ఆమె ఆరోగ్యం క్షీణించడంతో తల్లిదండ్రులు ఆమెను హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 16న మృతి చెందింది. దీంతో విద్యార్థులు, నాయకులు ఆందోళనకు దిగారు.

*** ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి**

తొమ్మిది వేల మంది విద్యార్థులున్న ఆసుపత్రిలో సరైన మందులు, సౌకర్యాలు లేక మెరుగైన వైద్యం అందడం లేదని విద్యార్థులు ఆరోపించారు. సౌకర్యాలు ఉంటే తేజస్విని మృతి చెందేది కాదని పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఆధునిక పరికరాలు లేవని, సిబ్బంది కొరత వేధిస్తోందని, మహిళా వైద్యులు లేకపోవడంతో విద్యార్థినులకు వైద్యం అందడం లేదన్నారు. ఇప్పటికైనా మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ.50లక్షల పరిహారం అందజేయాలని, ఆధునిక పరికరాలు ఏర్పాటు చేయాలని, ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని ఉపకులపతికి ఇస్తే ఎలాంటి హామీ ఇవ్వలేదని విద్యార్థులు మండిపడ్డారు.



## మైనార్టీల ఆర్థిక సాధికారత, విద్య, మతపరమైన మద్దతు కోసం ₹6,090 కోట్లను ఖర్చు చేస్తున్న ఘనత శ్రీ నారా చంద్రబాబు నాయుడుది

**– తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్.**

ఉయ్యూరులోని స్వాతి టైలర్స్ బజార్లో, సయ్యద్ అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొని మైనార్టీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోంది అని రాజేంద్రప్రసాద్ చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... మైనారిటీల కోసం ఆర్థిక సాధికారత, విద్య, మతపరమైన మద్దతుకు ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ పథకాలను చంద్రబాబు గారి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తుంది అని, 4.3 లక్షలకు పైగా ముస్లింలకు ఎన్టీఆర్ భరోసా పింఛను ఇవ్వడం జరుగుతుందని, ఇమామ్‌లు మరియు ముఅజ్జిన్‌లకు గౌరవ వేతనాలు పెంచిన ఘనత శ్రీ నారా చంద్రబాబునాయుడు గారిది అని రాజేంద్రప్రసాద్ గారు అన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ మాజీ సభ్యులు అబ్దుల్ నజీర్, ముస్లిం మైనార్టీ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## అసెంబ్లీకి కేసీఆర్ రావాలి..

# సూచనలు, సలహాలు ఇవ్వాలి: సీఎం రేవంత్



హైదరాబాద్: గవర్నర్ ప్రసంగం ద్వారా రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలు వివరించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గవర్నర్‌తో చర్చించిన తర్వాతే ప్రసంగాన్ని తయారు చేశామన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో సీఎం మాట్లాడారు. "రాజులు పోయినా.. రాజ్యాలు పోయినా.. రాచరికపు పోకడలు పోలేదు. కొందరు ఇంకా తమను తాము రాజులుగా భావిస్తున్నారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అదే అహంకార ధోరణి.. లేనప్పుడూ అదే ధోరణి" అని ప్రతిపక్షంపై మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులని పేర్కొన్నారు. "కొత్త గవర్నర్‌ను కలిసేందుకు ప్రతిపక్ష నేత వస్తారనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతుందనుకున్నాం. గవర్నర్ ప్రసంగంపై సూచనలు, సలహాలు వస్తాయనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం నుంచి కనీస స్పందన రాలేదు. కేసీఆర్ సభకు రావాలని కోరుకుంటున్నాం. ఆయన సభలో పాల్గొని సూచనలు, సలహాలు ఇవ్వాలి. ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో ఏర్పాటయ్యేందుకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విధానాలే కారణం. పీవీ, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి తొలిసారి హైటెక్ సిటీకి పునాది రాయి వేశారు. అనంతరం చంద్రబాబు, వాజ్‌పేయి హైటెక్ సిటీని పూర్తి చేశారు. ప్రస్తుతం ఏఐ ద్వారా లక్షలాది ఉద్యోగాలు పోయి నిరుద్యోగ సమస్య తలెత్తే పరిస్థితి. ఈ పరిస్థితుల్లో మనం భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉంది. సవాళ్లను ఎదుర్కోవడంపై విజన్ డాక్యుమెంట్‌ను సభలో ప్రవేశపెట్టాం.

**చెరువులను పునరుద్ధరిస్తున్నాం..**

ముందు చూపులో భాగంగానే హైదరాబాద్‌లో చెరువులను పునరుద్ధరిస్తున్నాం. కబ్జాల చెర నుంచి విడిపించి పునరుజ్జీవం చేస్తున్నాం. నాలాల్లో ఆక్రమణలను తొలగించి.. ముంపు సమస్యను పరిష్కరిస్తున్నాం. హైదరాబాద్‌లో నాలాలపై 28 వేల అక్రమ కట్టడాలు ఉన్నాయని గతంలో కేసీఆర్ అన్నారు. వాటిని నిర్దాక్షిణ్యంగా కూల్చాలని గతంలో కేటీఆర్ ఆదేశాలు ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కార్యాచరణనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. భాజపా నేతలు సబర్మతి, గంగా, యమునా నదుల ప్రాజెక్టుల గురించి గొప్పగా చెప్తున్నారు. కానీ, మూసీ ప్రాజెక్టును మాత్రం తప్పుపడుతున్నారు. మూసీ పరివాహకంలో ఎవరి అనుచరులు క్రికెట్ మైదానాలు నిర్మించారో ప్రజలకు తెలుసు. హైదరాబాద్‌లో మూడు వేల ఎలక్ట్రికల్ బస్సులు నడిపి కాలుష్యం తగ్గిస్తాం. పెట్రోల్, డీజిల్ ఆటోలనూ ఈవీలుగా మార్చే కార్యాచరణ చేపడుతున్నాం. మెట్రోను విస్తరించేందుకు కష్టపడుతున్నాం. నగరానికి మూడు బుల్లెట్ రైళ్లు రానున్నాయి.

*** రూ.లక్షల కోట్ల అప్పులను రీకన్‌స్ట్రక్షన్ చేశాం..**

గత ప్రభుత్వం అధిక వడ్డీకి భారీ స్థాయిలో అప్పులు చేసింది. రూ.లక్షల కోట్ల అప్పులను తక్కువ వడ్డీకి రీకన్‌స్ట్రక్షన్ చేశాం. దీంతో ఏటా రూ.4 వేల కోట్లు ఆదా అవుతున్నాయి. గత ప్రభుత్వం చేసిన అప్పుల్లో రూ.3.50 లక్షల కోట్లు చెల్లించాం. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. మహిళల పట్ల బీఆర్ఎస్ నేతలకు ఏ మాత్రం గౌరవం లేదు.

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు.. 2.6లక్షల మంది భారతీయులు స్వదేశానికి

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు అక్కడ ఉన్న ప్రవాస భారతీయుల్లో 2.6లక్షల మంది స్వదేశానికి చేరుకున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. యూఏఈ నుంచి భారత్‌లోని వివిధ ఎయిర్‌పోర్టులకు దాదాపు 70 విమాన సర్వీసులు నడుస్తున్నట్లు పేర్కొంది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం మన పౌరులు, విద్యార్థులకు సాయం అందిస్తోందని.. అనేక మంది భారతీయులు ఇరాన్ సరిహద్దు దాటి ఆర్మేనియా, అజర్‌బైజాన్‌లకు వెళ్లాలని భావిస్తున్నట్లు చెప్పింది.

**కువైట్ యువరాజుతో మోదీ సంభాషణ..**

గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తుండడంతో అక్కడున్న భారతీయుల భద్రతపై ఆందోళన



వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో కువైట్ యువరాజుతో ప్రధాని మోదీ (PM Modi) ఫోన్‌లో సంభాషించారు. కువైట్‌పై దాడులను భారత్ ఖండిస్తోందన్నారు. హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకలు సురక్షితంగా, స్వేచ్ఛగా వెళ్లేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి నిరంతర దౌత్య చర్చలు ఎంతో అవసరమని ఉద్ఘాటించారు.



## దేవెగౌడపై ఖర్గే వ్యాఖ్యలు.. మోదీ నవ్వులు

ఢిల్లీ : రాజ్యసభలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. అనేక అంశాలపై అధికార, విపక్ష నేతల మధ్య వాడీవేడీ చర్చ జరిగే సభలో నేడు ఆహ్లాదకర వాతావరణం కనిపించింది. జేడీఎస్ అధినేత దేవెగౌడ సహా పలువురి సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వీడ్కోలు ప్రసంగం చేశారు. ఈ క్రమంలో మాజీ ప్రధాని దేవెగౌడను ఉద్దేశిస్తూ.. 'ప్రేమ, పెళ్లి' పదాలను ఉపయోగించడంతో సభలో నవ్వులు విరిశాయి. ఖర్గే మాటలతో ప్రధాని మోదీ (PM Modi) కూడా నవ్వులు చిందించారు. ''దేవెగౌడతో 54ఏళ్లుగా పరిచయం. వారితో కలిసి పనిచేశాను. కానీ, ఏం జరిగిందో తెలియదు కానీ, మాతో కలిసి పనిచేసి.. చివరకు కేంద్రంలోని అధికార పార్టీతో చేతులు కలిపారు'' అని ఖర్గే పేర్కొన్నారు. ఈ క్రమంలో తమతో 'డేటింగ్' చేసి వారిని 'పెళ్లి' చేసుకున్నారనే పదాలు వాడడంతో సభలో నవ్వులు విరిశాయి. 1996 లోక్‌సభ ఎన్నికల తర్వాత యునైటెడ్ ఫ్రంట్ ఏర్పడగా.. దేవెగౌడ కొంతకాలం ప్రధానమంత్రిగా పనిచేశారు. ఆ కూటమికి కాంగ్రెస్ బయటనుంచి మద్దతు ఇచ్చింది. 2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ జేడీఎస్, కాంగ్రెస్‌లు కలిసి పోటీచేశాయి. ఆ తర్వాత ఎన్డీయేతో పొత్తు పెట్టుకున్న జేడీఎస్.. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో కొనసాగుతోంది. ఈ పరిణామాలను ప్రస్తావిస్తూ ఖర్గే వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో పూర్తి విరామం ఉండదు.. ఏప్రిల్, జులై మధ్యకాలంలో 59 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సభలో ప్రసంగిస్తూ.. వారి సేవలను కొనియాడారు. పార్లమెంట్‌ను ఓపెన్ యూనివర్సిటీగా అభివర్ణించిన మోదీ.. రాజకీయాల్లో పూర్తి విరామం అనేది ఉండదన్నారు. సభలో లేనప్పటికీ సామాజిక జీవితంలో చురుకుగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున ఖర్గే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్ సేవలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. వారు తమ సగం జీవితం పార్లమెంటరీ కార్యకలాపాల్లో గడిపారని ప్రశంసించారు.

## 'అందుకే కాంగ్రెస్‌తో విడాకులు': దేవెగౌడ




జేడీఎస్.. కాంగ్రెస్‌తో డేటింగ్ చేసి భాజపాను పెళ్లి చేసుకుందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సరదాగా చేసిన వ్యాఖ్యలపై మాజీ ప్రధాని దేవెగౌడ స్పందించారు. మిత్రుడు ఖర్గే మాట్లాడిన సమయంలో తాను సభలో లేనన్నారు. కాంగ్రెస్ నుంచి ఎందుకు విడిపోవాల్సి వచ్చిందో అనే విషయాన్ని సరదాగా, వాస్తవికంగా తెలియజేస్తున్నానంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. ఖర్గే పరిభాషలో చెప్పాలంటే.. కాంగ్రెస్‌తో బలవంతంగానే కలవాల్సి వచ్చిందన్నారు. అదో హింసాత్మక బంధమని.. అందుకే ఆ పార్టీతో విడిపోవాల్సి వచ్చిందని, అందుకు దారితీసిన పరిస్థితులను దేవెగౌడ (Deve Gowda) వివరించారు. ''2018లో కుమారస్వామిని ముఖ్యమంత్రి చేస్తామని ఆఫర్ చేసిన కాంగ్రెస్.. గులామ్ నబీ ఆజాద్‌తో రాయబారం పంపింది. అందుకు నేను అంగీకరించలేదు. ఖర్గేను సీఎంను చేయాలని అందరి సమక్షంలోనే చెప్పా. సిద్ధరామయ్య కూడా అక్కడే ఉన్నారు. అయితే, కుమారస్వామి సీఎం కావాలని ఆజాద్ పట్టుబట్టారు. అప్పుడు అన్నీ సవ్యంగానే జరిగినప్పటికీ.. 2019లో ఏం జరిగింది? వాళ్లు మమ్మల్ని పక్కనపెట్టేశారు. ఎంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భాజపాలో చేరారు?, వారిని ఎవరు పంపించారనే విషయం అందరికీ తెలిసిందే. ఫిరాయింపులను ప్రోత్సహించిన వ్యక్తిపై అప్పుడు కాంగ్రెస్ చర్యలు తీసుకొని ఉంటే.. ఇప్పుడు ఏఐసీసీ అధ్యక్షుడిగా ఖర్గే మరింత ఉన్నత స్థితిలో ఉండేవారు'' అని దేవెగౌడ పేర్కొన్నారు.

## తండ్రిని సంచిలో పెట్టి..
## కొరియర్ చేసేందుకు ప్రయత్నించి!

బెంగళూరు: సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్ చేసేందుకు కొందరు రకరకాల ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రాంక్ వీడియో కోసం ఓ బృందం చేసిన విచిత్ర పనులు చర్చనీయాంశమయ్యాయి. ఓ యువతి తన తండ్రిని బస్తాలో మూటకట్టి కొరియర్ కార్యాలయానికి తీసుకెళ్లడం గమనార్హం. అనుమానించిన అక్కడి సిబ్బంది.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారంతా పారిపోయిన ఘటన బెంగళూరులో చోటుచేసుకుంది. బెంగళూరులోని కొరియర్ కార్యాలయానికి ఓ యువతితోపాటు పలువురు ఓ పెద్ద సంచిని తీసుకువచ్చారు. దాన్ని పార్శిల్ పంపించాలని కోరారు. అయితే, అందులో కదలికలు కనిపించడంతో సిబ్బందికి అనుమానం వచ్చింది. దాన్ని తెరవగా.. ఓ వ్యక్తి అందులో నుంచి బయటకు రావడం చూసి కంగుతిన్నారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగానే వారంతా పరారయ్యారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు వారిని పట్టుకొని విచారించగా ప్రాంక్ వీడియో కోసమే ఈ నాటకమాడినట్లు తేలింది. పండగల వేళ బస్సు టికెట్ ధరలు పెరిగిపోవడం, టికెట్లు దొరక్కపోవడం వంటి పరిస్థితులను తెలియజేసేందుకే ఇలా నటించామని వివరించారు. అనంతరం పోలీసులు వారిని హెచ్చరించి వదిలిపెట్టారు. చేసిన తప్పిదానికి క్షమాపణలు చెబుతూ ఆ బృందం ఓ వీడియో విడుదల చేసింది.

## జన్‌జీతో కలిసి పనిచేస్తే.. బిలియనీర్ ఆసక్తికర వ్యాఖ్యలు

యువతరం గురించి మాట్లాడేటప్పుడు ఈ మధ్యకాలంలో జన్‌జీ పదం ఎక్కువగా వినిపిస్తోంది. వారు దూకుడుగా ఉంటారు..వీరితో పనిచేయించుకోవడం కొంచెం కష్టమే అనే మాటలు వినిపిస్తున్నాయి. కానీ వేదాంతా ఛైర్మన్ అనిల్ అగర్వాల్ మాత్రం.. ఈ తరంతో కలిసి పనిచేయడం తనకు ఇష్టమని చెప్తున్నారు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా పెట్టిన పోస్టు వైరల్ అవుతోంది. ''భారత్‌లో అత్యధిక సంఖ్యలో జనరేషన్‌జీ (1997-2012 మధ్య పుట్టిన)కి చెందినవారు ఉన్నారు. నా తరం వారు చాలామంది అంగీకరించరు కానీ.. జన్‌జీతో కలిసి పనిచేయడం అంటే నాకు ఇష్టం. వారిలాగా నా నిద్రను ట్రాక్ చేయడానికి ఒక యాప్ కూడా వాడలేదు. ఇలా చెప్తూ పోతే.. మా రెండు తరాల మధ్య పెద్ద పోలికలేం ఉండవు. మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తున్న తొలి తరం ఇదే. ఇతరులకు అదే విషయం చెప్తున్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు అప్పుడప్పుడు విరామం



తీసుకుంటున్నారు. దీంతో మరింత శక్తి పుంజుకొని తిరిగి విధుల్లోకి వస్తున్నారు.. ఈ చర్య కెరీర్‌లో వారి పట్ల వారికున్న శ్రద్ధను తెలియజేస్తోంది. పెద్దలు చెప్పిందల్లా పిల్లలు గుడ్డిగా వినాలనే రోజులు పోయాయి. నిజం చెప్పాలంటే అదేమీ చెడ్డవిషయం కాదు. ఈ తరానికి సొంత ఆలోచనలు ఉన్నాయి. మనం అనుకున్న దానికంటే వారు బాధ్యతాయుతంగా, క్రియేటివ్‌గా ఉన్నారు. వారిని ఎక్కువగా గమనించిన అనంతరం ఒక విషయం అర్థమైంది. నేర్చుకోవాలన్న తపనే ఈ తరాల మధ్య అంతరాలను తొలగిస్తుంది. వారు మనలాగా మారాలని కోరుకునే బదులు.. మనమే వారిలాగా ఉంటే బెటరేమో. స్లీప్ ట్రాకింగ్ యాప్స్‌ను వాడాల్సిన సమయం వచ్చిందేమో. వాటిని వాడిన తర్వాత అవి ఎలా పనిచేస్తాయో మీకూ చెప్తాను'' అని అగర్వాల్ తన పోస్టులో రాసుకొచ్చారు.

## దేశంలో తొలి ఎల్పీజీ 'ఏటీఎం'.. ఎక్కడుందో తెలుసా?

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో గ్యాస్ కొరత భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో హరియాణా గురుగ్రామ్‌లో ఉన్న ఎల్పీజీ గ్యాస్ ఏటీఎం (LPG gas ATM) అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. గతేడాది పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ఏఐ ఆధారిత గ్యాస్ సిలిండర్ స్మార్ట్ వెండింగ్ మెషిన్‌ను ఏర్పాటు చేసింది. ఏటీఎం మాదిరిగా ఇది పని చేస్తుంది. దీంతో సిలిండర్ల (Cylinders) కోసం ఎక్కువ రోజులు ఎదురు చూడడం, గంటలపాటు క్యూలో నిల్చోవడం ఉండదు. కేవలం 23 నిమిషాల్లోనే సిలిండర్ తీసుకోవచ్చు. సాధారణంగా నివాసాల్లో ఉపయోగించే లోహంతో చేసిన సిలిండర్లతో పోలిస్తే ఈ ఏటీఎంలలో




లభ్యమయ్యే సిలిండర్లు తేలికగా ఉంటాయి. సాధారణ సిలిండర్లు అందులోని గ్యాస్‌తో కలిపి మొత్తం 31కిలోల బరువు ఉంటాయి. అయితే ఫైబర్‌తో తయారు చేసిన ఈ సిలిండర్లు గ్యాస్‌తో కలిపి కేవలం 15కిలోల బరువు మాత్రమే ఉంటాయి. వీటిని తీసుకువెళ్లడం కూడా సులువు. భారత్‌గ్యాస్ కాంపోజిట్ సిలిండర్ కనెక్షన్ ఉన్న వినియోగదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు.

**ఎలా వినియోగించాలంటే..?**


* వినియోగదారులు నమోదిత మొబైల్ నెంబర్‌తో గ్యాస్ సిలిండర్ స్మార్ట్ వెండింగ్ మెషిన్లో లాగిన్ అవ్వాలి
* నమోదిత ఫోన్ నంబర్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేసి, ధ్రువీకరించాలి
* అనంతరం వచ్చిన క్యూఆర్ (QR) కోడ్‌ను స్కాన్ చేసి, యూపీఐ (UPI), డెబిట్ కార్డు ద్వారా డబ్బులు చెల్లించాలి
* చెల్లింపు పూర్తైన వెంటనే గ్యాస్ సిలిండర్ ఏటీఎం డోర్‌లో నుంచి బయటకు వస్తుంది.
* మనం తీసుకువచ్చిన ఖాళీ సిలిండర్‌ను మెషిన్ పైన ఉంచగానే అది లోపలికి వెళ్తుంది.

**24 గంటలు అందుబాటులో..**

ఎల్పీజీ ఏటీఎం 24గంటలు వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది. ఏ సమయంలో అయినా నిమిషాల్లోనే మెషిన్ నుంచి సిలిండర్లను తీసుకోవచ్చు. ఇందులో ఒకేసారి 10 సిలిండర్లను నిల్వ చేసే సామర్థ్యం ఉంటుంది. నిల్వ తగ్గినప్పుడు గ్యాస్ ఏజెన్సీకి ఆటోమెటిక్‌గా మెసేజ్ వెళుతుంది. మెసేజ్ అందుకున్న వెంటనే సిబ్బంది ఏటీఎంలో సిలిండర్లను ఏర్పాటు చేస్తారు.

## ఎన్ఐఏ అదుపులో అమెరికన్

అమెరికా కిరాయి సైనికుడు మాథ్యూ వాన్‌డైకె భారత్‌లో అరెస్టయ్యాడు. అతడితో పాటు మరో ఆరుగురు ఉక్రెయిన్ జాతీయులు ప్రస్తుతం జాతీయ దర్యాప్తు సంస్థ అదుపులో ఉన్నారు. వీరు పర్యటక వీసాపై దేశంలోకి ప్రవేశించి, భారత్ వ్యతిరేక సంస్థలతో పనిచేస్తున్నారని ఎన్ఐఏ వెల్లడించింది. మాథ్యూది అమెరికాలోని మేరీలాండ్ తానొక అంతర్జాతీయ వ్యాపారవేత్త, సైనికుడు, వార్ కరస్పాండెంట్, కాలమిస్ట్ అని తన వెబ్‌సైట్‌లో పేర్కొన్నాడు. గతంలో పాత్రికేయుడిగా ఇరాక్‌లో అమెరికా దళాలతో కలిసి ఉన్నాడు. తాను లిబియా విప్లవంలో పాల్గొన్నానని, అప్పుడు పట్టుబడి జైలు శిక్ష అనుభవించానని చెప్తుంటాడు. ఒక మిలిటరీ కాంట్రాక్ట్ కంపెనీ సన్స్ ఆఫ్ లిబర్టీ ఇంటర్నేషనల్ (SOLI)ని స్థాపించాడు. ''ఉగ్రవాదం, అణచివేత పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్నవారికి ఉచిత భద్రత, శిక్షణ అందించే లాభాపేక్ష లేని సంస్థ'' అని SOLI గురించి పేర్కొన్నాడు. డ్రోన్ వార్‌ఫేర్ ట్రైనింగ్, అక్రమంగా సరిహద్దు దాటడానికి ప్రయత్నించడం, ఈశాన్య భారత్‌కు సమీపంలో చురుగ్గా ఉన్న సాయుధ గ్రూపులతో సంబంధాల కింద ఎన్ఐఏ అతడిపై చట్టవిరుద్ధ కార్యకలాపాల కింద కేసు నమోదు చేసింది. ఉగ్రవాద చర్యలకు ప్రేరేపించడం, కుట్రపన్నడం వంటి అభియోగాలు నమోదైనట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ''నిందితులు వేర్వేరు తేదీల్లో సరైన పత్రాలు లేకుండానే భారత్‌లోని మిజోరం రాష్ట్రానికి చేరుకున్నారు. అక్కడి నుంచి మయన్మార్‌లోని సైనిక పాలనకు వ్యతిరేకంగా పోరాడుతోన్న గ్రూప్‌లకు డ్రోన్ వార్‌ఫేర్ ట్రైనింగ్ ఇవ్వాలన్నది వీరి లక్ష్యం'' అని ఎన్ఐఏ వర్గాలు వెల్లడించాయి. అలాగే డ్రోన్ల కన్‌సైన్‌మెంట్ ఒకటి ఐరోపా నుంచి మయన్మార్‌కు భారత్ మీదుగా



వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. అది కూడా మయన్మార్‌లోని తిరుగుబాటు గ్రూప్‌ల కోసమేనని అనుమానిస్తున్నారు. మయన్మార్‌లో చురుగ్గా ఉన్న గ్రూప్‌లకు భారత్‌లో నిషేధం ఎదుర్కొంటున్న సంస్థలతో సంబంధాలున్నాయని భావిస్తున్నారు.

## 2 వారాలుగా స్థావరాలు మార్చినా.. ఇజ్రాయెల్ గురికి చిక్కిన లారిజానీ

ఇరాన్ అత్యున్నత సైనికాధికారి అలీ లారిజానీని చంపేసి ఆ దేశాన్ని గట్టి దెబ్బకొట్టింది ఇజ్రాయెల్. యుద్ధం తొలిరోజున సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీని చంపేసిన తర్వాత టెహ్రాన్‌కు ఇంత భారీస్థాయిలో నష్టం జరగడం మళ్లీ ఇప్పుడే. ఖమేనీ మరణం తర్వాత నుంచి ఇజ్రాయెల్‌కు చిక్కకుండా లారిజానీ అనేకసార్లు స్థావరాలు మార్చినప్పటికీ.. పక్కా నిఘా సమాచారంతో ఐడీఎఫ్ అతడిని అంతమొందించింది.

*** 1600 కిలోమీటర్ల దూరంలో ఉన్నా..**

ఇరాన్ లో అత్యంత శక్తిమంతమైన నేతగా లారిజానీకి పేరుంది. ఖమేనీ మరణం తర్వాత నుంచి ఇజ్రాయెల్ అతడిపై గురిపెట్టింది. కానీ, లారిజానీ కదలికలను గుర్తించడం అంత తేలికైన పనికాదు. శత్రువులకు చిక్కకుండా దాక్కోవడంలో సిద్ధహస్తుడని పేరు. అందుకుతగ్గట్లుగానే గత రెండు వారాల నుంచి రహస్య ప్రాంతంలో ఉంటూ ఇరాన్ సైన్యాన్ని నడిపిస్తున్నారు. నిఘా వర్గాలకు దొరక్కుండా తరచూ స్థావరాలు మార్చినట్లు ఇజ్రాయెల్ రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. దీంతో లారిజానీని ట్రాక్ చేసేందుకు ఇజ్రాయెల్ ప్రత్యేక వ్యవస్థను రంగంలోకి దించింది.

ఈ క్రమంలోనే అతడు కుమార్తె ఇంట్లో ఉన్నాడని తెలుసుకున్న నిఘా వర్గాలు ఐడీఎఫ్ దళాలకు సమాచారమిచ్చాయి. అనంతరం ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ ఆలస్యం చేయకుండా ఆపరేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 1600 కిలోమీటర్ల దూరంలో ఉన్న టార్గెట్‌ను ఛేదించేందుకు యుద్ధ విమానాలను పంపారు. అత్యంత పక్కా సమాచారంతో ఐడీఎఫ్ దళాలు లారిజానీ ఉన్న ప్రాంతంలో వైమానిక దాడులు జరిపాయి. ఈ ఘటనలో లారిజానీతో పాటు అతడి కుమారుడు కూడా మృతి చెందాడు.

**ఒకే సమయం.. రెండు టార్గెట్లు..**

ఇదిలాఉండగా.. లారిజానీ ఆపరేషన్ చేసిన సమయంలోనే ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ అనుబంధ బసీజ్ మిలీషియా అధిపతి జనరల్ గులాం రెజా సొల్మనీని కూడా ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంది. ఒకే సమయంలో పూర్తిగా వేర్వేరు ప్రాంతాల్లో విజయవంతంగా దాడులు నిర్వహించినట్లు ఇజ్రాయెల్ రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి.






### డాలర్ జోరు.. రూపాయి బేజారు..
# ఆల్‌టైమ్ కనిష్ఠానికి పతనం

అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ మరోసారి చరిత్రాత్మక కనిష్ఠానికి పడిపోయింది. ఇవాల్టి ట్రేడింగ్‌లో రూపాయి విలువ 92.63 వద్ద ఆల్ టైమ్ కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటం, దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ నిధుల తరలింపు కొనసాగడం వంటి అంశాలు రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో ఈరోజు ఉదయం 92.42 వద్ద ప్రారంభమైన రూపాయి, ఆ తర్వాత మరింత బలహీనపడింది. మంగళవారం రూపాయి 92.37 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. కీలకమైన 92.50 స్థాయిని దాటి కిందకు పడటంతో అమ్మకాల ఒత్తిడి పెరిగిందని, దీనికి తోడు బ్యాంకు సెలవుల కారణంగా డాలర్ల లభ్యత తక్కువగా ఉండటం కూడా రూపాయి పతనానికి కారణమైందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పర్మార్ వివరించారు. దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ భారీగా ఉందని ఆయన తెలిపారు. మరోవైపు పెరుగుతున్న దిగుమతుల బిల్లుల కారణంగా రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వీపీ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది అన్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల అధిక ముడి చమురు ధరలు, హర్మూజ్ జలసంధి ద్వారా రవాణాకు అంతరాయాలు కలగడం వంటి అంశాలు భారత్‌కు దిగుమతి వ్యయాన్ని పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్థూల ఆర్థిక పరిస్థితులు రూపాయికి ప్రతికూలంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో డాలర్‌తో రూపాయి విలువ 92.25 నుంచి 92.95 శ్రేణిలో కదలాడవచ్చని త్రివేది అంచనా వేశారు.

# పాన్ రూల్స్ కఠినతరం.. ఆధార్‌తో దరఖాస్తు మార్చి 31 వరకే

శాశ్వత ఖాతా సంఖ్యకు (PAN) సంబంధించిన దరఖాస్తు నిబంధనలు కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి కఠినతరం కానున్నాయి. ఏప్రిల్ 1 నుంచి ఆధార్ కార్డుతో పాన్ దరఖాస్తులను అనుమతించబోరు. అంటే ఎవరైనా ఆధార్ కార్డు సాయంతో పాన్ పొందాలనుకుంటే మార్చి 31 వరకే గడువు ఉంది. కాబట్టి కొత్తగా పాన్ కోసం దరఖాస్తు



చేసుకోవాలనుకుంటే నిర్ణీత గడువులోగా ఆ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్రానికి చెందిన కామన్ సర్వీస్ ఎంటర్ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలకు కీలకమైన పాన్‌ను పొందాలంటే ఏప్రిల్ 1 నుంచి ఆధార్‌తో పాటు అదనపు డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుంది. పుట్టిన తేదీని ధ్రువీకరించే పత్రాలు ఇందుకు అవసరం అవుతాయి. బర్త్ సర్టిఫికెట్, ఓటర్ ఐడీ కార్డు, మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, అఫిడవిట్, పాస్ట్ పోర్ట్ వంటి పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాల్సి ఉంటుంది. కొత్త రూల్స్ అమల్లోకి వచ్చాక దరఖాస్తు ఫారాలు కూడా మారనున్నాయని కామన్ సర్వీస్ సెంటర్ పేర్కొంది. ఆన్‌లైన్‌లో కొత్త పాన్ కార్డు కోసం Protean, UTITSL వెబ్‌సైట్లను సందర్శించాలని సూచించింది. తక్షణమే ఇపాన్ పొందాలంటే ఆదాయపు పన్ను ఇఫైలింగ్ పోర్టల్‌లో కూడా పొందొచ్చు.

### జియో గుడ్‌న్యూస్..
# రోమింగ్‌ప్యాక్ లేకపోయినా ఓటీపీలు

ప్రముఖ టెలికాం కంపెనీ రిలయన్స్ జియో ఇంటర్నేషనల్ ట్రావెలర్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. వైఫై కాలింగ్ ఆప్షన్ ద్వారా ఉచితంగా ఇన్‌కమింగ్ ఎస్సెమ్మెస్‌లు పొందే సదుపాయం కల్పిస్తోంది. ఇందుకోసం ఎలాంటి ఇంటర్నేషనల్ రోమింగ్ ప్యాక్‌ను యాక్టివేట్ చేసుకోవాల్సిన అవసరం లేదు. అంటే విదేశాల్లో ఉన్నప్పుడు ఎలాంటి రుసుములూ లేకుండానే బ్యాంకు ఓటీపీలు, బ్యాంకింగ్ అలర్ట్‌లు వంటివి పొందొచ్చని 'ఫోన్ అరెనా' పేర్కొంది. వైఫై నెట్‌వర్క్‌కు కనెక్ట్ అయ్యుండి, తమ స్మార్ట్‌ఫోన్‌లో వైఫై కాలింగ్ సదుపాయాన్ని యాక్టివేట్ చేసుకున్న యూజర్లు ఈ సదుపాయాన్ని పొందొచ్చు. అంటే కేవలం ముఖ్యమైన సందేశాలు పొందడం కోసం ఇంటర్నేషనల్ రోమింగ్ ప్యాక్‌ను యాక్టివేట్ చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ సదుపాయం తప్పిస్తుంది. ముఖ్యంగా విదేశాల్లో ఉన్నప్పుడు బ్యాంకు ఓటీపీలు, లావాదేవీలకు సంబంధించిన సమాచారం, ఏదైనా అకౌంట్‌లోకి లాగిన్ అవ్వాల్సిన సందర్భంలో వెరిఫికేషన్ సందేశాలు అవసరం అవుతుంటాయి. అలాంటప్పుడు మొబైల్‌లో ఈ సదుపాయం యాక్టివేట్ చేసుకుంటే సరి




పోతుంది. అయితే, దేశీయంగా ఏదైనా రీఛార్జి ప్లాన్ యాక్టివ్‌లో ఉండాలి. అలాగే, వైఫై కాలింగ్ సదుపాయానికి ఆ స్మార్ట్‌ఫోన్ సపోర్ట్ చేస్తుండాలి.

# ఆంథ్రోపిక్ సంచలనం.. ఫోన్ సాయంతో రిమోట్‌గా పీసీతో పని!

ప్రముఖ ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ మరో సంచలనం సృష్టించేందుకు సిద్ధమైంది. తన ఏఐ అసిస్టెంట్ క్లాడ్‌లో కొత్త సదుపాయం తీసుకొచ్చింది. దీని సాయంతో మీరు ఇంట్లో లేకపోయినా మీ పీసీతో పనిచేయించొచ్చు. స్మార్ట్‌ఫోన్ సాయంతో మీ పీసీని రిమోట్‌గా నియంత్రించొచ్చు. 'క్లాడ్ డిస్‌ప్యాచ్'గా కంపెనీ ఈ ఫీచర్‌కు నామకరణం చేసింది. ఉదాహరణకు ఆఫీసు నుంచి మీ సొంత పనిమీద బయటకు వెళ్లారనుకుందాం. తిరిగి వస్తుండగా ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. ఆఫీసుకొచ్చిన వెంటనే రిపోర్ట్ తయారుచేసి ప్రజంటేషన్ ఇవ్వాలి. కానీ, అంత టైమ్ లేదు. అప్పుడు మీ ఫోన్ నుంచే రిపోర్ట్ తయారుచేయవచ్చు. మీ డెస్క్‌టాప్‌కు ఫలానా ఫోల్డర్‌లో ఉన్న సమాచారం ఆధారంగా రిపోర్ట్ తయారుచేయాలని క్లాడ్‌ని అడగొచ్చు. మీరొచ్చేలోపు క్లాడ్ ఆ పని సిద్ధం చేసి పెడుతుంది.

### ఆర్సీబీకి గుండెకాయ
# విరాట్ కోహ్లినే: ఏబీ డివిలియర్స్


రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఫ్రాంచైజీకి భారత బ్యాటింగ్ దిగ్గజం విరాట్ కోహ్లియే మూలస్తంభమని, అతడే జట్టుకు గుండెకాయ వంటివాడని ఆ జట్టు మాజీ సూపర్‌స్టార్ ఏబీ డివిలియర్స్ ప్రశంసించాడు. కేవలం బ్యాటింగ్‌తోనే కాకుండా మైదానంలో అతను కనబరిచే ఉత్సాహం, నాయకత్వ పటిమ జట్టుకు ఎంతో కీలకమని అభిప్రాయపడ్డాడు. గతేడాది ఐపీఎల్ లో తొలిసారిగా ట్రోఫీ గెలిచి చరిత్ర సృష్టించిన ఆర్సీబీ, ఈసారి కూడా టైటిల్ నిలబెట్టుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో డివిలియర్స్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. జియోహాట్‌స్టార్‌తో మాట్లాడుతూ డివిలియర్స్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "సంవత్సరాలుగా బ్యాట్‌తో అద్భుతమైన ప్రదర్శన ఇవ్వడమే కాదు, తన ఉనికితో, ఎనర్జీతో జట్టుకు విరాట్ ఇప్పటికీ ప్రాణం పోస్తున్నాడు. జట్టు గెలుపు కోసం మైదానంలోనూ, వెలుపలా అతను పోరాడే తీరు ప్రశంసనీయం. అతని ఉత్సాహం యువ ఆటగాళ్లలో స్ఫూర్తి నింపుతుంది. మనం కచ్చితంగా ట్రోఫీ గెలవగలం అనే నమ్మకాన్ని కలిగిస్తుంది. గతేడాది ఆర్సీబీ విజయంలో ఇదే కీలకపాత్ర పోషించింది" అని డివిలియర్స్ తెలిపాడు. గత సీజన్‌లో ఆర్సీబీ ప్రదర్శనను ఏబీడీ విశ్లేషించాడు. "గతంలో ఆర్సీబీ ఇద్దరు, ముగ్గురు ఆటగాళ్లపైనే ఎక్కువగా



ఆధారపడేది. కానీ, గత సీజన్‌లో ఆ పరిస్థితి మారింది. జట్టు మొత్తం సమష్టిగా రాణించింది. కోహ్లి ఓపెనర్‌గా ప్రధాన స్కోరర్లలో ఒకడిగా ఉన్నప్పటికీ, మిగతా ఆటగాళ్లు కూడా బాధ్యత తీసుకున్నారు. ఫైనల్ మ్యాచే ఇందుకు చక్కటి ఉదాహరణ. ఆ మ్యాచ్‌లో కోహ్లి 35 బంతుల్లో 43 పరుగులు చేశాడు. కానీ, రజత్ పాటిదార్, లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, రొమారియో షెఫర్డ్ వంటి వారు వేగంగా ఆడి జట్టు స్కోరును 190 దాటించారు. కృనాల్ పాండ్యా బంతితో రాణించాడు" అని గుర్తుచేశాడు. ఈ సమష్టి కృషే కోహ్లీకి అదనపు బలమని డివిలియర్స్ పేర్కొన్నాడు. "జట్టు భారాన్ని ఇకపై తానొక్కడినే మోయాల్సిన అవసరం లేదనే భావన కోహ్లిలో కలిగింది. తన చుట్టూ ట్రోఫీ గెలవాలనే కసి ఉన్న ఫైటర్స్ ఉన్నారని అతను నమ్ముతున్నాడు. అందుకే ఆర్సీబీ ఇప్పుడు చాలా పటిష్ఠంగా ఉంది. దాదాపు పాత జట్టుతోనే బరిలోకి దిగుతుండటంతో ఈ సీజన్‌లోనూ టైటిల్ గెలిచే సత్తా వారికి ఉందని నేను నమ్ముతున్నాను" అని ధీమా వ్యక్తం చేశాడు. కాగా, ఐపీఎల్ 2026 సీజన్‌ను ఆర్సీబీ ఈ నెల 28న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే మ్యాచ్‌తో ప్రారంభించనుంది.




### ఐసీసీ ర్యాంకింగ్స్: టాప్-5 వన్డే బ్యాటర్లలో
# కోహ్లి, రోహిత్, శుభ్‌మన్ గిల్



వన్డేలో ప్రపంచ అత్యుత్తమ ఆటగాళ్ల జాబితాను ఐసీసీ ప్రకటించింది. ఐసీసీ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో టాప్5లో ముగ్గురు భారత క్రికెటర్లు ఉన్నారు. ఈ ఫార్మాట్‌లో కివీస్ బ్యాట్స్‌మన్ డారిల్ మిచెల్ అగ్రస్థానంలో ఉన్నాడు. టాప్5లో ఉన్న ముగ్గురు భారత ఆటగాళ్లలో విరాట్ కోహ్లి (2వ ర్యాంకు), రోహిత్ శర్మ (4వ ర్యాంకు), శుభ్‌మన్ గిల్ (5వ ర్యాంకు)లో ఉన్నారు. బౌలింగ్ విభాగంలో కుల్‌దీప్ యాదవ్ ఎనిమిదో ర్యాంకులో ఉన్నాడు. పాకిస్థాన్‌పై వన్డే సిరీస్‌ను గెలిపించిన బంగ్లాదేశ్ కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ బౌలర్ల జాబితాలో తొమ్మిది స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంకుకు చేరాడు. భారత బౌలర్ల నుంచి కుల్‌దీప్ ఒక్కడే టాప్10లో ఉన్నాడు. ఆల్ రౌండర్ల జాబితాలో మిరాజ్ రెండు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంకులో నిలిచాడు. టీమిండియా ఆటగాడు అక్షర్ పటేల్ 10వ ర్యాంకులో కొనసాగుతున్నాడు. జట్లపరంగా టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత్ నాలుగో స్థానంలో ఉంది. వన్డే, టీ20ల్లో అగ్రస్థానంలో ఉంది. టీ20 ర్యాంకింగ్ విషయానికి వస్తే బౌలింగ్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా ఒక ర్యాంకును మెరుగుపరుచుకొని టాప్5లోకి వచ్చాడు. మొదటి రెండు స్థానాల్లో రషీద్ ఖాన్ (753 పాయింట్లు), వరుణ్ చక్రవర్తి (740) నిలిచారు. బుమ్రా 702 పాయింట్లతో 5వ స్థానానికి ఎగబాకాడు. భారత ఎడమచేతివాటం బ్యాటర్లు అభిషేక్ శర్మ (875), ఇషాన్ కిషన్ (871) మొదటి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. తిలక్ వర్మ 742 పాయింట్లతో ఒక ర్యాంకు ఎగబాకి ఆరో స్థానంలో నిలిచాడు. సంజు శాంసన్ ఒక ర్యాంకును మెరుగుపరుచుకుని 21వ స్థానంలోకి వచ్చాడు. ఆల్ రౌండర్ల జాబితాలో జింబాబ్వే ఆటగాడు సికందర్ రజా, హార్దిక్ పాండ్యా మొదటి రెండు స్థానాల్లో ఉన్నారు.

# సన్‌రైజర్స్ కెప్టెన్‌గా ఇషాన్ కిషన్..
### వైస్ కెప్టెన్‌గా అభిషేక్ శర్మ

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక ప్రకటన చేసింది. రెగ్యులర్ కెప్టెన్, ఆస్ట్రేలియా దిగ్గజం పాట్ కమిన్స్ గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో తొలి కొన్ని మ్యాచ్‌లకు వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ జట్టుకు నాయకత్వం వహిస్తాడని ఫ్రాంచైజీ ప్రకటించింది. యువ సంచలనం అభిషేక్ శర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. "గాయం నుంచి కోలుకుంటున్నందున పాట్ కమిన్స్ కొన్ని మ్యాచ్‌లకు దూరమవుతాడు. అతను తిరిగి వచ్చే వరకు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా, అభిషేక్ శర్మ వైస్ కెప్టెన్‌గా ఉంటారు" అని సన్‌రైజర్స్ తమ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసింది. గతేడాది డిసెంబర్‌లో వెస్టిండీస్ పర్యటన తర్వాత వెన్ను గాయంతో బాధపడుతున్న కమిన్స్, అప్పటి నుంచి క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ఈ గాయం కారణంగానే అతను యాషెస్ సిరీస్‌లోని చివరి మ్యాచ్‌లు, 2026 టీ20 ప్రపంచకప్‌కు కూడా దూరమయ్యాడు. ఐపీఎల్ 2026 సీజన్ మలి దశలో అతను జట్టుతో చేరే అవకాశం ఉంది. 2025 నుంచి సన్‌రైజర్స్ జట్టులో ఉన్న ఇషాన్ కిషన్, ఇటీవల దేశవాళీ సీజన్‌లో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గెలిచిన జార్ఖండ్ జట్టుకు విజయవంతంగా నాయకత్వం వహించాడు. అయితే, ఐపీఎల్‌లో కెప్టెన్‌గా అతనికి ఇదే తొలిసారి కావడం విశేషం. ఐపీఎల్ 2016 విజేత అయిన సన్‌రైజర్స్ హైదరాబాద్, తమ 2026 సీజన్‌ను ఈ నెల 28న బెంగళూరులోని



ఎం. చిన్నస్వామి స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB)తో జరగనున్న మ్యాచ్‌తో ప్రారంభించనుంది. ఇక, ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో భారత్ విజయంలో ఇషాన్, అభిషేక్ ఇద్దరూ కీలక పాత్ర పోషించారు. అయితే, అనుభవంలో 27 ఏళ్ల ఇషాన్ సీనియర్ కావడంతో అతనికి కెప్టెన్సీ దక్కింది. ఇషాన్ ఇప్పటివరకు 119 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడగా, 25 ఏళ్ల అభిషేక్ 77 మ్యాచ్‌లలో ఆడాడు. కమిన్స్ సారథ్యంలో ఎస్ఆర్‌హెచ్ 30 మ్యాచ్‌లు ఆడి 15 విజయాలు సాధించింది. 2024లో జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లగా, గత సీజన్‌లో ఆరో స్థానంలో నిలిపాడు.

# పాక్ ప్లేయర్ కొనుగోలుపై వివాదం.. కావ్య మారన్‌కు లలిత్ మోదీ చురకలు.. 'కాల్ చేయండి' అంటూ ట్వీట్

ఐపీఎల్ వ్యవస్థాపకుడు, వివాదాస్పద వ్యాపారవేత్త లలిత్ మోదీ... సన్‌రైజర్స్ యజమాని కావ్య మారన్‌ను ఉద్దేశిస్తూ చేసిన ఓ ట్వీట్ ఇప్పుడు సంచలనంగా మారింది. ఇంగ్లండ్‌లో జరిగే 'ది హండ్రెడ్' లీగ్‌లో సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ ఓ పాకిస్థాన్ క్రికెటర్‌ను కొనుగోలు చేసిన వ్యవహారంలో ఆయన పరోక్షంగా చురకలు అంటించారు. వ్యాపార నిర్ణయాలు ఎలా తీసుకోవాలో తనకు బాగా తెలుసని, అవసరమైతే తనకు కాల్ చేయాలని సూచించడం చర్చనీయాంశమైంది.

**అసలేం జరిగింది..?**

ఇంగ్లండ్ వేదికగా జరిగిన 'ది హండ్రెడ్' పురుషుల లీగ్ వేలంలో కావ్య మారన్‌కు చెందిన సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ, పాకిస్థాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను 190,000 పౌండ్లకు (సుమారు రూ. 2.34 కోట్లు) కొనుగోలు చేసింది. ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అభిమానుల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో సన్‌రైజర్స్ లీడ్స్ 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాను తాత్కాలికంగా సస్పెండ్ చేశారు.

# థియేటర్ థ్రిల్ ఎంజాయ్ చేయండి

## ధురంధర్ దర్శకుడు ఆదిత్యధర్ లేఖ




**టాకీస్:** 'ధురంధర్ 2' కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తెలుగు అభిమానులకు బ్యాడ్ న్యూస్. మార్చి 19న మూవీ విడుదల నేపథ్యంలో ఒకరోజు ముందుగానే ప్రీమియర్స్ ప్రదర్శిస్తున్న సంగతి తెలిసిందే. హిందీతో పాటు దక్షిణాది భాషల్లో ఈ మూవీని విడుదల చేస్తున్నారు. 'ధురంధర్: ది రివెంజ్' ప్రీమియర్‌ను తెలుగులో చూడాలని టికెట్ బుక్ చేసుకున్న అభిమానులకు నిరాశ ఎదురైంది. పలు మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్ థియేటర్లు ప్రీమియర్స్‌ను క్యాన్సిల్ చేశాయి. టికెట్లు బుక్ చేసుకున్న వారికి అమౌంట్ రిఫండ్ కూడా చేశాయి. సాంకేతిక సమస్యలతో తెలుగు వెర్షన్ ప్రీమియర్‌ను రద్దు చేసినట్లు తెలుస్తోంది. గురువారం యథాతథంగా హిందీతో పాటు, తెలుగులోనూ ప్రదర్శించనున్నట్లు సమాచారం. మరోవైపు దర్శకుడు ఆదిత్య ధర్ అభిమానులతో ఆసక్తికర విషయం పంచుకున్నారు. సినిమా చివరివరకూ చూడమని సూచించారు. ఎండ్ క్రెడిట్స్ పడేవరకూ థియేటర్‌లోనే ఉండాలన్నారు. ఈ పోస్ట్‌తో మరో అంశం తెర పైకి వచ్చింది. 'పార్ట్ 3' ఉంటుందంటూ సినీ ప్రియులు పోస్టులు పెడుతున్నారు. 'ప్రియమైన 'ధురంధర్' ఫ్యామిలీ.. సినిమాను మీరెంతో ప్రేమించారు. ప్రతి చిన్న అంశాన్నీ గమనించి, గుర్తించి మెచ్చుకున్నారు. మళ్లీ మళ్లీ చూసి, ఎవరూ గుర్తించలేరనుకున్న అంశాలను కూడా గుర్తించారు. ఈ అందమైన, అంచనా వేయలేని ప్రయాణంలో మా సినిమా మీది అయింది. ఆ తర్వాత దేశానిది.. ప్రపంచానిది కూడా అయింది. ఒక ఫిల్మ్‌మేకర్‌కు ఇదొక గొప్ప గిఫ్ట్. 'ధురంధర్: ది రివెంజ్'తో మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తాం. మిమ్మల్ని భావోద్వేగానికి గురి చేస్తాం. సిద్ధంగా ఉండండి. స్నేహితులు, కుటుంబం ఇలా అందరితో కలిసి ప్రతి ట్విస్ట్, ఎమోషన్ థియేటర్‌లోనే అనుభూతి చెందండి. మొబైల్ స్క్రీన్‌లో దానిని ఆస్వాదించలేరు. నా విన్నపం ఏంటంటే, దయచేసి సినిమా చూసిన తర్వాత ట్విస్ట్‌లన్నీ చెప్పేయకండి. సినిమా చూసే వారికీ ఆ అనుభూతిని ఉంచండి. ఎండ్ క్రెడిట్ టైటిల్స్ పూర్తయ్యే వరకూ సీట్ల నుంచి లేచి వెళ్లిపోకండి' అని దర్శకుడు ఆదిత్య ధర్ లేఖలో పేర్కొన్నారు. భారతీయ సినీ పరిశ్రమలో సరికొత్త రికార్డులను లిఖించిన 'ధురంధర్' చిత్ర సృష్టికర్త ఆదిత్య ధర్ తాజాగా తన అభిమానులను ఉద్దేశించి ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు.

# 'సర్కే చునరి' పాటపై కేంద్రం నిషేధం..

## స్వేచ్ఛకు నైతికత హద్దులు ఉండాలన్న అశ్విన్ వైష్ణవ్



**టాకీస్:** బాలీవుడ్ సినీ నటులు నోరా ఫతేహి, సంజయ్ దత్ నటించిన 'సర్కే చునరి' పాటపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ పాటలోని సాహిత్యం మరియు దృశ్యాలు అసభ్యకరంగా ఉన్నాయన్న విమర్శల నేపథ్యంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో ఈ నిర్ణయాన్ని ధృవీకరించారు. సమాజ్ వాదీ పార్టీ ఎంపీ ఆనంద్ భదౌరియా అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2) ప్రకారం భావప్రకటనా స్వేచ్ఛ అనేది సంపూర్ణమైనది కాదని, అది సమాజం, సంస్కృతి, నైతికతకు లోబడి ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా డిజిటల్ మాధ్యమాల్లో సమాచారం వేగంగా వ్యాపిస్తున్న తరుణంలో మహిళలు, పిల్లలు మరియు వెనుకబడిన వర్గాల రక్షణ కోసం ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు.వీశీజఱవం 'కేడీ: ది డెవిల్' చిత్రంలోని ఈ పాట విడుదలైనప్పటి నుంచి హర్యానా, కర్ణాటక మహిళా కమిషన్లతో పాటు నటులు రవి కిషన్, కంగనా రనౌత్, గాయకుడు అర్మాన్ మాలిక్ వంటి ప్రముఖులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

# నాగ్ వందో సినిమాను రా కార్తీక్ మెప్పించేనా

**టాకీస్:** టాలీవుడ్‌లో ఇటీవల చర్చనీయాంశంగా మారిన చిత్రం 'మేడ్ ఇన్ కొరియా'. ఈ సినిమా విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి మిక్స్‌డ్ రెస్పాన్స్ రావడంతో దర్శకుడు రా కార్తీక్ పేరు ఇండస్ట్రీలో ట్రెండింగ్‌గా మారింది. ముఖ్యంగా ఈ సినిమా ఫలితం తర్వాత కింగ్ నాగార్జున అభిమానుల్లో కొంత గందరగోళ పరిస్థితి కనిపిస్తోంది. కారణం ఏమిటంటే, నాగార్జున కెరీర్‌లో మైలురాయిగా నిలిచే 100వ సినిమాను రా కార్తీక్ తెరకెక్కించనున్నాడు. 'మేడ్ ఇన్ కొరియా' చిత్రంలో భావోద్వేగాలు ఉన్నప్పటికీ కథలోని ఎమోషన్స్‌ను బలంగా చూపించడంలో దర్శకుడు కొంత వెనుకబడ్డారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో రా కార్తీక్ ప్రస్తుతం నాగార్జునతో కలిసి పనిచేస్తుండటం ఆసక్తికరంగా మారింది. నాగార్జున కెరీర్‌లో 100వ సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. యూనిక్ స్టోరీ టెల్లింగ్, థ్రిల్లింగ్ కథనాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తీక్ ఈ సినిమాకు ఎలాంటి కథను సిద్ధం చేశారోనని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కానీ 'మేడ్ ఇన్ కొరియా'కు వచ్చిన మిక్స్‌డ్ స్పందన తర్వాత అక్కినేని అభిమానుల్లో కొంత అనుమానం మొదలైంది. నాగార్జున వంటి సీనియర్ స్టార్‌కు 100వ సినిమా ఎంతో కీలకం కావడంతో కథ, దర్శకత్వం, నిర్మాణ విలువలు అన్నీ అత్యుత్తమంగా ఉండాలని అభిమానులు ఆశిస్తున్నారు.





# హీరోల ఆలోచనా విధానంపై తాప్సీ విమర్శలు

టాకీస్: బాలీవుడ్ 'ఫైర్ బ్రాండ్' తాప్సీ పన్ను తాజాగా ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో మరోసారి ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా అగ్ర హీరోల అభద్రతా భావం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. తాప్సీ తన తాజా ఇంటర్వ్యూలో హీరోల ఆలోచనా విధానాన్ని ఎండగట్టింది. కథానాయికలకు ప్రాధాన్యత ఉన్న సినిమాల్లో నటించడానికి చాలా మంది స్టార్ హీరోలు సిద్ధంగా లేరని ఆమె విమర్శించింది. ఈ సందర్భంగా తనకు ఎదురైన ఒక చేదు అనుభవాన్ని తాప్సీ పంచుకుంది.

"ఒక సినిమాలో నేను డబుల్ రోల్ చేస్తున్నప్పుడు, సదరు హీరో ఆ ప్రాజెక్ట్‌ను రిజెక్ట్ చేశాడు. దానికి ఆయన చెప్పిన కారణం ఏంటంటే.. సినిమాలో హీరోయిన్ పాత్రకు ఎక్కువ నిడివి, ప్రాధాన్యత ఉంటే చివరకు ప్రేక్షకుల సానుభూతి, ప్రశంసలు ఆమెకే దక్కుతాయని ఆయన భయపడ్డాడు. అంతకుముందే ఆ హీరోతో తాను కలిసి పనిచేసినప్పటికీ... కేవలం తన పాత్రకు ప్రాధాన్యత ఎక్కువగా ఉందనే అభద్రతా భావంతో ఆయన వెనక్కి తగ్గడం నన్ను ఆశ్చర్యపరిచింది" అని తాప్సీ వెల్లడించింది.

కేవలం సీనియర్ హీరోలే కాదు, ఇండస్ట్రీలోకి కొత్తగా వస్తున్న యువ హీరోలు కూడా హీరో పాత్ర నిడివి తక్కువగా ఉంటే అటువంటి సినిమాలకు దూరంగా ఉంటున్నారని ఆమె విమర్శించింది. హీరోయిన్ డామినేట్ చేస్తుందనే భయంతో మంచి కథలను వదులుకోవడం వల్ల చిత్ర పరిశ్రమలో సమానత్వం అనేది ప్రశ్నార్థకంగా మారుతోందని ఆమె అభిప్రాయపడింది. ప్రస్తుతం తాప్సీ వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

MOVIE TIME

# వసూళ్లు ఖాయం.. ఎంతనేది చెప్పలేను

## ఉస్తాద్‌పై దర్శకుడు హరీష్ శంకర్



**టాకీస్:** ఈ ఉగాది 'ఉస్తాద్ ఉగాది'గా మారనుందని దర్శకుడు హరీష్ శంకర్ అన్నారు. అగ్రహీరో నుంచి పూర్తిస్థాయి కమర్షియల్ సినిమా వచ్చి చాలా రోజులవుతోంది. ఈ చిత్రం అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. మిగతా సినిమాలకు ఉన్న టికెట్ రేట్లు మన సినిమాకు తెలంగాణలో రాలేదు. అందుకే ఇది ఎంత వసూళ్లు చేస్తుంది అని నేను చెప్పలేను. రూపాయి ఎక్కువ చేస్తుందా.. తక్కువ చేస్తుందా అని చెప్పలేను. కానీ, ఒక విషయం మాత్రం చెప్పగలను.. ఇది చూసిన తర్వాత 'ఇలాంటి సినిమా వచ్చి చాలా రోజులైంది' అని అందరూ అనుకుంటారు. పవన్ కల్యాణ్ నుంచి అభిమానులు ఏం కోరుకుంటారో అన్నీ ఇందులో ఉన్నాయి. నేను రికార్డులను మనసులో పెట్టుకోలేదు. ఎందుకంటే అవి విడుదల తేదీల ఆధారంగా ఉంటాయి. మనం ఒకటి తలిస్తే.. దైవం ఒకటి తలచినట్లు మార్చి 26న రావాల్సిన చిత్రం ఇప్పుడు విడుదలవుతోందని అన్నారు. సినిమా కలెక్షన్లు ఎప్పుడూ విడుదల తేదీ పైనే ఆధారపడి ఉంటాయి. సంక్రాంతికి వస్తే ఒకలా, సమ్మర్‌లో మరోలా.. ఏ సినిమా లేకపోతే ఇంకోలా.. ఇలా మారిపోతూ ఉంటాయి. అందుకే నేను రికార్డుల గురించి ఆలోచించట్లేదు. ఎక్కడా డబ్బు వృథా చేయకుండా ఈ సినిమాను తీశాను. ఎడిట్ చేయకముందు ఫస్ట్ హాఫ్ నిడివి 1.19 గంటలంతే. అందులో నుంచి ఫైల్‌లో కొంచెం తీసేశాం. సెకండ్ హాఫ్ కూడా అంతే తక్కువ నిడివి వచ్చింది. అందుకే నాకు ఎడిటింగ్ వర్క్ చాలా తక్కువ అయింది. పవన్ కల్యాణ్ వల్లే సినిమా ఇంత బాగా వచ్చింది. ఇక చివరి నిమిషంలో ఒక హీరోలాగా ఎంటర్ అయిన మా బావ తమన్‌కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. అడగ్గానే 10, 12 రోజుల్లో పూర్తి చేశాడు. థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఫస్ట్ తన గురించే మాట్లాడుకుంటారు' అని హరీశ్ శంకర్ అన్నారు.

# మార్చి 27న పెద్ది టీజర్ విడుదల

**టాకీస్:** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'పెద్ది'. గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా ఈ సినిమా విడుదల కావడానికి సిద్ధమవుతోంది. అయితే, ఇంకా షూటింగ్ మాత్రం కంప్లీట్ కాలేదు. రిలీజ్‌కు మరో ఆరు వారాల సమయం మాత్రమే ఉంది. మరి సినిమా అనుకున్న సమయానికి విడుదల అవుతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటం తో చిత్రబృందం షూటింగ్ పనుల్లో వేగాన్ని పెంచింది. తాజా సమాచారం ప్రకారం, సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయింది. కేవలం మరో పది రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉందట. ఈ చివరి షెడ్యూల్‌లో కొన్ని కీలకమైన సన్నివేశాలతో పాటు, స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించబోతున్నారు. ఇక్కడితో పెద్ది షూటింగ్ కంప్లీట్ అయిపోయినట్టే. ఇదే స్పీడ్‌లో మార్చి 27న రామ్ చరణ్ బర్త్ డే గిఫ్ట్‌గా పెద్ది టీజర్ రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. అక్కడి నుంచి బ్యాక్ టు బ్యాక్ అప్డేట్స్‌తో ప్రమోషన్స్ స్పీడ్ పెంచనున్నారు. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండగా.. ఇప్పటికే రిలీజ్ అయిన పాటలు సెన్సేషనల్ చార్ట్ బస్టర్ అయ్యాయి. అలాగే.. స్పెషల్ సాంగ్ కోసం రెహమాన్ అదిరిపోయే మాస్ బీట్ ఇచ్చినట్టుగా తెలుస్తోంది. ఈ పాటలో చరణ్‌తో కలిసి స్టెప్పులు వేయడానికి ఇద్దరు స్టార్ హీరోయిన్లను రంగంలోకి దింపుతున్నాడట బుచ్చిబాబు. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ వంటి వారు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.